SCAN ME

www.vaarthavedhikasurya.com

PRGI NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 33 | సోమవారం, 22 జూన్, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 33 | MONDAY, JUNE 22, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |

ప్రపంచంలోనే అతిపెద్ద జెంబే డ్రమ్ సర్కిల్‌తో గిన్నిస్ వరల్డ్ రికార్డ్

- హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన "రిథమ్"

2

# నీట్ రీటెస్ట్ కఠినం

- బెంబేలెత్తించిన ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రశ్నలు • కాస్త సులువుగా వృక్ష, జంతుశాస్త్రాలు • ఈసారి కటాఫ్ తగ్గిపోవచ్చన్న నిపుణులు • 430-450 స్కోర్ చేస్తే తెలంగాణలో కన్వీనర్ కోటా సీటు రావొచ్చని అంచనా • దేశవ్యాప్తంగా హాజరైన 20 లక్షల మంది • తెలంగాణలో 89.09 శాతం హాజరు • నిమిషం ఆలస్యమైనా అనుమతించని అధికారులు.. విద్యార్థుల కన్నీళ్లు • కాన్వాయ్‌తో అభ్యర్థులకు ఇబ్బందికావొద్దని 45నిమిషాలు ఢిల్లీ ఎయిర్‌పోర్టులోనే మోదీ








న్యూఢిల్లీ/హైదరాబాద్, జూన్ 21 (వార్త వేదిక సూర్య):

ఉద్విగ్నభరిత వాతావరణం మధ్య నీట్-2026 పునః పరీక్ష పూర్తయింది. దేశవ్యాప్తంగా 5,440 కేంద్రాలలో పరీక్ష కోసం 22.74 లక్షల మంది రిజిస్టర్ చేసుకోగా, 19.95 లక్షల మంది పరీక్ష రాసినట్టు ఎన్‌టీఏ తెలిపింది. తెలంగాణలోని 208 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష కోసం 73,059 మంది రిజిస్టర్ చేసుకోగా, 65,087 మంది (89.09 శాతం) హాజరయ్యారు. పరీక్ష కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు.. నిర్ధారిత సమయం తర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చినా అభ్యర్థులను పరీక్షకు అనుమతించలేదు. గూగుల్ మ్యాప్స్‌లో లొకేషన్ తప్పుగా చూపించడం, ట్రాఫిక్ జామ్‌లు, హాల్‌టికెట్లలో పేర్కొన్న వివరాల్లో గందరగోళం వంటి కారణాలతో వేలాది మంది అభ్యర్థులు సమయానికల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోలేకపోయారు. ఆలస్యంగా వచ్చిన వారిని లోనికి అనుమతించకపోవడంతో పలు చోట్ల అభ్యర్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. బతిమాలారు. చివరికి కన్నీళ్లతో వెనుదిరిగారు. మరోవైపు నీట్ పరీక్ష రాసి బయటికి వచ్చిన విద్యార్థుల్లోనూ కొంత ఆందోళన కనిపించింది. పరీక్షలు సుదీర్ఘంగా, కఠినంగా వచ్చాయని అభ్యర్థులు పేర్కొన్నారు. రద్దయిన నీట్‌ను చాలా బాగా రాశామని, కానీ ఇప్పుడు కఠినంగా రావడం ఆందోళన కలిగిస్తోందని వాపోయారు. మే 3న మిగతా 2లో..



# సముద్ర రంగంలో నిర్ణాయక శక్తిగా భారత్!

- అభివృద్ధి, సంపద, భద్రత.. సముద్రాలతోనే సాధ్యం
- భవిష్యత్తులో లక్షలాది మందికి ఉపాధి • దునగిరి, సంశోధక్, అగ్రయ్ ప్రారంభంలో ప్రధాని మోదీ

కోల్‌కతా, జూలై 21: సముద్ర రంగంలో పట్టు సాధించకుండా ఏ దేశమూ గొప్ప శక్తిగా ఎదగలేదని... అభివృద్ధి, సంపద, భద్రత అన్నీ సముద్రాలతోనే ముడిపడి ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భారత్ కూడా కేవలం రక్షణ పరికరాలు కొనుగోలు చేసే దేశంగానే మిగిలిపోకుండా.. వాటిని ఉత్పత్తి చేసే దేశంగా ఎదుగుతోందని చెప్పారు. తద్వారా రానున్న కాలంలో సముద్ర రంగంలో ప్రపంచ స్థాయి నిర్ణయాలు తీసుకునే శక్తిగా అవతరిస్తుందని స్పష్టం చేశారు. గత కొన్నేళ్లలో 40కి పైగా యుద్ధ, సర్వే నౌకలు, జలాంతర్గాములు భారత నౌకాదళంలో చేరాయని.. మరో 45 నిర్మాణ దశలో ఉన్నాయని వెల్లడించారు. అత్యాధునిక స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన స్టెల్త్ ఫ్రిగేట్ 'ఐఎన్ఎస్ దునగిరి', సర్వే నౌక 'ఐఎన్ఎస్ సంశోధక్', జలాంతర్గామి వ్యతిరేక యుద్ధనౌక 'ఐఎన్ఎస్ అగ్రయ్' అనే మూడు మిగతా 2లో..



## ఏడుగురిని బలిగొన్న విష వాయువు

- రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో అమ్మోనియా లీక్..
- తీవ్ర అస్వస్థతకు గురైన సుమారు 60 మంది
- చికిత్స పొందుతూ ఏడుగురు కార్మికులు మృతి
- తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లాలో ఘటన

2లో..

# మూసీ విధ్వంసంతో.. మహాత్ముడి ఆత్మఘోష

- మూసీలో కమీషన్ల కోసం వేలాది పేదల ఇండ్లు కూల్చుతున్న రేవంత్ సర్కార్ • చోటే భాయ్-బడే భాయ్ కుట్ర.. కాంగ్రెస్ విధ్వంస రాజకీయాలకు బీజేపీ మద్దతు • గాడ్సేను నమ్మే రేవంత్.. మహాత్మా గాంధీ విగ్రహం పెడుతానంటూ దొంగ మాటలు • కాంగ్రెస్ సర్కార్‌కు గాంధీపై ప్రేముంటే పేదల ఇండ్లు విగ్రహం కట్టాలి • రాజేంద్రనగర్ నియోజకవర్గ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూన్ 21 (వార్త వేదిక సూర్య):

గాంధీ మహాత్ముడి పేరుతో రేవంత్‌రెడ్డి చేస్తున్న మూసీ విధ్వంసాన్ని చూస్తే మహాత్ముడి ఆత్మ కూడా ఘోషిస్తుందని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కమీషన్లు, కాసుల కోసం వేలాది మంది పేద, మధ్యతరగతి ప్రజల ఇండ్లను కూల్చేందుకు రేవంత్‌రెడ్డి చేస్తున్న కుట్రను స్వయంగా మహాత్మాగాంధీ మనుమడు తుషార్ గాంధీ కూడా వ్యతిరేకించారని, అయినా వినకుండా పేదలపై సీఎం తన ప్రతాపం చూపుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి నమ్మేది గాడ్సేను అయినా మహాత్మా గాంధీ విగ్రహం పెడుతానని దొంగ మాటలు చెప్తున్నారని మండిపడ్డారు. గాంధీపై నిజంగా రేవంత్‌కు మిగతా 2లో..






## భర్తతో ఘర్షణ.. ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తానూ ఆత్మహత్యాయత్నం

- ఒకరు నిదట్లోనే కన్నుమూత.. ఇంకో చిన్నారి చికిత్స పొందుతూ మృత్యువాత
- ఆమె పరిస్థితి విషమం

2లో..



## మంటలు చెలరేగి.. ఆర్టీసీ బస్సు దగ్ధం

- డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులకు తప్పిన ప్రాణాపాయం
- కరీంనగర్ సమీపంలోని అలుగునూర్ శివారులో ఘటన..

2లో..

## రోడ్డు ప్రమాదంలో కుటుంబం బలి

- ప్రాణాలు కోల్పోయిన భార్యాభర్త, కుమారుడు
- మృతదేహాలను ఇంటికి తేవద్దన్న యజమాని

ములకలపల్లి, జూన్ 21(వార్త వేదిక సూర్య):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మాదారం అటవీ ప్రాంతం వద్ద కారు చెట్టును బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఘటనలో భద్రాచలానికి చెందిన సాయి(25), ఆయన భార్య సంధ్య(23), కుమారుడు మోక్షిత్(4) అక్కడికక్కడే మృతి చెందగా.. తల్లి జ్యోతి తీవ్ర గాయాలపాలయ్యారు. ఆమెను పాల్వంచ వైద్యశాలకు తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఐదు నెలల క్రితం సాయి తండ్రి శ్రీనివాసరావు మిగతా 2లో..



# డిజిటల్ సేవలకు గుర్తింపుగా స్కోచ్‌అవార్డు

- టీ-ఫైబర్‌ను అభినందించిన మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జూన్ 21 (వార్త వేదిక సూర్య):

రాష్ట్రంలో నాణ్యమైన డిజిటల్ సేవలను అందించే దిశగా చర్యలను వేగవంతం చేయాలని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆదివారం టీ-ఫైబర్‌ను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని గృహాలు, ప్రభుత్వ సంస్థలకు టీ-ఫైబర్ సేవలను ప్రాధాన్యతా క్రమంలో విస్తరించాలని సంస్థ ఎండీ పన్నీరు వేణుప్రసాద్‌కు సూచించారు. గ్రామాలకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించడంతో పాటు, మిగతా 2లో..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సోమవారం
22 జూన్, 2026
సంపుటి: 2 | సంచిక: 33
Follow:

## మంటలు చెలరేగి.. ఆర్టీసీ బస్సు దగ్ధం

**తిమ్మాపూర్, జూన్ 21 (వార్త వేదిక సూర్య):**

ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు చెలరేగి.. చూస్తుండగానే క్షణాల్లో దగ్ధమైంది. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో త్రుటిలో ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. ఆదివారం కరీంనగర్ జిల్లా అలుగునూర్ శివారులో ఈ ఘటన చోటు చేసుకుంది. కరీంనగర్-2 డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్ సహా 42 మందితో కరీంనగర్ బస్టాండ్ నుంచి ఉదయం హైదరాబాద్‌కు బయల్దేరింది. అలుగునూర్ దాటి తర్వాత కాకతీయ కాలువ వద్దకు చేరుకోగానే బస్సులో నుంచి కాలిన వాసన రావడంతో డ్రైవర్ బోయిని ప్రశాంత్ అప్రమత్తమయ్యాడు. సమీపంలో పెట్రోల్ బంక్, విద్యుత్తు తీగలుండటంతో ప్రమాదాన్ని ఊహించి కొంచెం ముందుకు తీసుకెళ్లి రోడ్డు పక్కన సురక్షిత ప్రాంతంలో నిలిపేశాడు. వెంటనే ఎమర్జెన్సీ డోర్ తెరవడంతో పాటు అందరూ దిగిపోవాలని కోరాడు. ఆందోళనలో కొందరు ప్రయాణికులు అద్దాలు పగలగొట్టుకుని కిటికీల నుంచి బయటకు దూకారు. ప్రయాణికులు దిగిన కొన్ని నిమిషాల్లోనే బ్యాటరీలు ఉన్న బాక్సుల నుంచి మంటలు వేగంగా వ్యాపించి బస్సును చుట్టుముట్టాయి. డయల్ 100కు కాల్ చేయడంతో ఎల్‌ఎండీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

## డిజిటల్ సేవలకు గుర్తింపుగా స్కోచ్‌అవార్డు

(మొదటి పేజీ తరువాయి)

ఈ-గవర్నెన్స్ సేవలకు బలమైన డిజిటల్ మౌలిక వసతులు కల్పించడంలో చేసిన విశేష కృషిని గుర్తిస్తూ.. 'తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్' (టీ-ఫైబర్)కు ప్రతిష్ఠాత్మక స్కోచ్ అవార్డు-2026 దక్కింది. ఈ మేరకు న్యూఢిల్లీలో 'వికసిత్ భారత్ కోసం నియంత్రణ చట్రం' అనే అంశంపై నిర్వహించిన 108వ స్కోచ్ సదస్సులో టీ-ఫైబర్ ఎండీ వేణుప్రసాద్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా టీ-ఫైబర్ ఎండీ, అధికారులు ఆదివారం మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి సంస్థకు దక్కిన అవార్డు గురించి వివరించారు.

## రోడ్డు ప్రమాదంలో కుటుంబం బలి

(మొదటి పేజీ తరువాయి)

(ట్రాన్స్‌కో లైన్ ఇన్‌స్పెక్టర్) గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం నాటి ప్రమాదంలో శ్రీనివాసరావు కుమారుడు, కోడలు, మనవడు ప్రాణాలు కోల్పోయారు. సంప్రదాయంలో భాగంగా నిద్రకు రమ్మని ములకలపల్లిలోని చిన్నాన్న పిలవడంతో సాయి కుటుంబం కారులో వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగింది. మృతదేహాలను ఇంటికి తేవద్దంటూ ఇంటి యజమాని సాయి బంధువులకు ఫోన్ చేసినట్లు తెలిసింది. అద్దెకు ఉంటున్న వారి ఇంటికి మరో తాళం వేసి వెళ్లిపోయినట్లు సమాచారం.

## ప్రపంచంలోనే అతిపెద్ద జెంబే డ్రమ్ సర్కిల్‌తో గిన్నిస్ వరల్డ్ రికార్డ్

**హైదరాబాద్, జూన్ 21 (వార్త వేదిక సూర్య):**

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం శనివారం లయ, సంగీతం మరియు ఐక్యతకు ప్రతీకగా మారింది. "రిథమ్ – వరల్డ్స్ లార్జెస్ట్ జెంబే డ్రమ్ సర్కిల్" పేరిట నిర్వహించిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో 2,000 మంది డ్రమర్లు ఒకే వేదికపై, ఒకే లయలో జెంబే డ్రమ్స్ వాయిస్తూ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రయత్నంలో పాల్గొన్నారు. ది జెంబే సర్కిల్ వ్యవస్థాపకుడు మరియు సీఈఓ సాయి కుమార్ యేలేశ్వరపు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం వేలాది మంది ప్రేక్షకులను ఆకట్టుకుంది. సంగీతం ద్వారా సమాజంలో ఐక్యత, సానుకూలత మరియు సామాజిక చైతన్యాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, గాయకుడు& సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, నిర్వాహకులను అభినందించారు. ప్రపంచ రికార్డు సాధన లక్ష్యంతో పాటు, ఈ కార్యక్రమం "సే నో టు డ్రగ్స్" అనే సామాజిక సందేశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, సృజనాత్మకత మరియు కళల వైపు అడుగులు వేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సాయి కుమార్ యేలేశ్వరపు మాట్లాడుతూ, "లయ అనేది మనుషులను కలిపే సార్వత్రిక భాష. ఈ కార్యక్రమం ద్వారా సంగీత శక్తిని ప్రపంచానికి చాటడంతో పాటు, సమాజానికి సానుకూల సందేశాన్ని అందించగలిగినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ మా కృతజ్ఞతలు" అని అన్నారు.

# నీట్ రీటెస్ట్ కఠినం

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రాలు లీకైన నేపథ్యంలో అదే నెల 12న పరీక్షను రద్దు చేస్తున్నట్టు ఎన్టీఏ ప్రకటించింది. తిరిగి ఆదివారం (ఈ నెల 21న) మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్షను తిరిగి నిర్వహించింది. పరీక్ష లీకేజీతో విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళన, మళ్లీ అలాంటి ఘటన జరిగితే ఎలాగన్న సందేహాల నేపథ్యంలో.. నీట్ పునః పరీక్షకు కేంద్ర ప్రభుత్వం అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. దేశవ్యాప్తంగా 551 పట్టణాల్లోని 5,440 సెంటర్ల వద్ద గట్టి భద్రత కల్పించింది. పరీక్షలు జరిగిన సుమారు 95 వేల గదులు, పరీక్షా కేంద్రం ఆవరణల్లో కలిపి మొత్తంగా 1.38 లక్షల సీసీ కెమెరాలు, 51,311 సిగ్నల్ జామర్లను ఏర్పాటు చేసింది. పరీక్ష జరుగుతున్న తీరును కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఢిల్లీలోని ఓఖ్లా ప్రాంతంలో ఉన్న ఎన్టీఏ ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షించారు. గుజరాత్‌లో నీట్ పరీక్షా కేంద్రాల వద్ద డ్రోన్లతో నిఘా పెట్టారు. నీట్ పునః పరీక్ష నిర్వహణ కోసం ప్రభుత్వంలోని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేశాయని.. అధికారులు, సిబ్బంది, పోలీసులు కలిపి సుమారు 7 లక్షల మంది విధులు నిర్వర్తించారని ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ తెలిపారు. కోల్‌కతాలో వారం క్రితం సృష్టి దూబే అనే యువతి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. పక్కటెముకలు, ఊపిరితిత్తులకు శస్త్ర చికిత్సలు జరిగాయి. వేగంగా కోలుకున్న ఆమె నీట్ పరీక్ష రాస్తానని కోరింది. దీనిపై సృష్టి తండ్రి విజ్ఞప్తి మేరకు ఎన్టీఏ అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రంలో ప్రత్యేక గదిలో వైద్య సహాయం పొందుతూనే సృష్టి పరీక్ష రాశారు. అహ్మదాబాద్‌లోని ఓ పరీక్షా కేంద్రం వద్ద హిందూ, ముస్లిం అభ్యర్థులను లోనికి అనుమతించే అంశంపై వివాదం నెలకొంది. హిందూ అభ్యర్థులను పవిత్రమైన దారాలు, ఆభరణాలను తొలగించాకే లోనికి పంపుతున్న అధికారులు.. మరోవర్గం వారు బుర్ఖా, హిజబ్ ధరించినా లోనికి పంపడం ఏమిటని పలువురు హిందూ సంఘాల నేతలు, అభ్యర్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. అదే సమయంలో ఎంఐఎం పార్టీ నేతలూ అక్కడికి చేరుకున్నారు. దీనితో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, అధికారులు వారికి నచ్చజెప్పి పంపేశారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఓ విద్యార్థి తన మేనమామతో కలిసి పరీక్షా కేంద్రానికి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గాయపడిన విద్యార్థికి ప్రథమ చికిత్స చేసి హడావుడిగా పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లినా.. అప్పటికే సమయం ముగియడంతో లోనికి అనుమతించలేదు. సంగారెడ్డి జిల్లా తారా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలోని పరీక్షా కేంద్రంలో అమెరికా నుంచి వచ్చిన హిమనీష్ పరీక్ష రాశారు. కోల్‌కతా పర్యటనకు వెళ్లిన మోదీ తిరిగివస్తూ.. ఆదివారం మధ్యాహ్నం 1.15 గంటల సమయంలో ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్నారు. కానీ వెంటనే తన నివాసానికి బయల్దేరలేదు. ఆ సమయంలో తాను కాన్వాయ్‌తో బయటికి వెళితే రోడ్లపై ట్రాఫిక్ నిలిచిపోయి.. నీట్ పరీక్ష కోసం వెళ్లేవారికి ఇబ్బంది అవుతుందని భావించారు. సుమారు 45 నిమిషాలు విమానాశ్రయంలోనే వేచిఉండి.. తర్వాత బయలుదేరారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన అభ్యర్థికి అబుధాబిలో నీట్ పరీక్షా కేంద్రాన్ని కేటాయించిన అంశంపై విమర్శలు వెల్లువెత్తడంతో ఎన్టీఏ వివరణ ఇచ్చింది. విదేశాల్లో ఉన్న భారతీయ అభ్యర్థులు నీట్ రాసేందుకు వీలుగా పలు దేశాల్లో 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపింది. నీట్ పరీక్ష రద్దు తర్వాత పునః పరీక్ష కోసం తగిన పట్టణాన్ని ఎంపిక చేసుకునేందుకు అభ్యర్థులకు అవకాశం ఇచ్చామని.. ఆ సమయంలో సదరు అభ్యర్థికి చెందిన లాగిన్ నుంచే అబుధాబి పరీక్షా కేంద్రాన్ని ఎంపిక చేసినట్టు గుర్తించామని వెల్లడించింది. పరీక్షకు రెండు రోజుల ముందు పరీక్షా కేంద్రాన్ని నాగ్‌పూర్‌కు మార్చాలంటూ విజ్ఞప్తి రాగా.. సానుకూల నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేసింది. నీట్ పునః పరీక్ష ప్రశ్నపత్రం కాస్త కఠినంగా వచ్చింది. మొత్తం 180 ప్రశ్నల్లో సగం సాధారణంగా ఉంటే, మరో సగం చాలా కఠినంగా వచ్చాయని అభ్యర్థులు, నిపుణులు తెలిపారు. వృక్ష, జంతుశాస్త్రాలకు సంబంధించిన 90 ప్రశ్నల్లో ఐదారు మినహా మిగతావి తేలికగానే ఉన్నాయని చెప్పారు. మే 3న నిర్వహించిన పరీక్షతో పోల్చినా సులువుగానే ఉన్నాయని.. మెరిట్ విద్యార్థులు దాదాపు అన్నింటికీ జవాబు ఇవ్వగలరని వివరించారు. ఇక భౌతిక శాస్త్రం (ఫిజిక్స్) ప్రశ్నలు మాత్రం అత్యంత కఠినంగా ఉన్నాయని.. కొన్ని మెరిట్ విద్యార్థులు కూడా జవాబు రాయలేని స్థాయిలో ఉన్నాయని తెలిపారు. సాధారణ విద్యార్థులు సగం ప్రశ్నలకే జవాబు ఇవ్వగలరని వెల్లడించారు. ఇక రసాయన శాస్త్రం ప్రశ్నలు కూడా మే3 నాటి పరీక్షతో పోలిస్తే చాలా క్లిష్టంగా ఉన్నాయని తెలిపారు. 6-7 ప్రశ్నలైతే సుదీర్ఘంగా, తికమకకు గురయ్యేలా ఉన్నాయని చెప్పారు. ఒకట్రెండు ప్రశ్నలకు సరైన సమాధానాలు లేవని, వాటికి బోనస్ మార్కులు ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. మొత్తంగా నీట్ కఠినంగా ఉన్న నేపథ్యంలో ఈసారి కటాఫ్ తగ్గిపోయే అవకాశం ఉందని నిపుణులు స్పష్టం చేశారు. 430-450 మధ్య స్కోర్ చేసిన వారికి తెలంగాణలో కన్వీనర్ కోటా సీటు దక్కే అవకాశాలు ఉన్నాయని అంచనా వేశారు. నీట్ హాల్‌టికెట్లలో పరీక్ష కేంద్రం చిరునామాలు హైరానాకు దారితీశాయి. విజయవాడ రహదారివైపు ఉన్న హయత్‌నగర్, రాజేంద్రనగర్ ప్రాంతంలోని హయత్‌నగర్ మధ్య అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. దీనితో పలువురు పరీక్ష రాయలేకపోయారు. నల్గొండకు చెందిన స్పందన హాల్‌టికెట్‌పై పరీక్షా కేంద్రం చిరునామా 'ప్రభుత్వ హైస్కూల్, మాణిక్యమ్మ కాలనీ, రాజేంద్రనగర్, హయత్‌నగర్' అని ఉండటంతో ఆమె విజయవాడ రోడ్డులోని హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాల వద్దకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రం వద్ద సిబ్బంది హాల్‌టికెట్‌ను పరిశీలించి.. రాజేంద్రనగర్‌కు వెళ్లాలని చెప్పారు. ఆమె హడావుడిగా బయలుదేరినా రాజేంద్రనగర్‌కు చేరుకోవడానికి గంటకు పైగా సమయం పట్టింది. అప్పటికే సమయం మించిపోవడంతో పరీక్షకు అనుమతించలేదు. రాజేంద్రనగర్‌లోని సాహెబ్‌నగర్‌లో ఉన్న మరో పరీక్షా కేంద్రం చిరునామాలోనూ ఇలాగే శివరాంపల్లి, హయత్ నగర్, రంగారెడ్డి అని ఉంది. దీనితో ఈ రెండు పరీక్షా కేంద్రాలకు రావాల్సిన సుమారు 40 మంది విద్యార్థులు.. హయత్‌నగర్‌కు వెళ్లి, అక్కడి నుంచి రాజేంద్రనగర్‌కు వచ్చారు. కొందరు సమయానికి చేరుకోగా, మరికొందరికి ఆలస్యం కావడంతో పరీక్ష రాయలేక కన్నీళ్లతో వెనుదిరిగారు. అధికారుల నిర్లక్ష్యంతో తమ భవిష్యత్తుపై దెబ్బపడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక హైదరాబాద్‌లోని టోలిచౌకికి చెందిన హసన్‌హష్మి అనే విద్యార్థికి బొల్లారం కేంద్రీయ విద్యాలయలో సెంటర్ కేటాయించగా.. సరైన అవగాహన లేక తిరుమలగిరిలోని కేంద్రీయ విద్యాలయకు వచ్చారు. పొరపాటును గుర్తించి ఆందోళన పడ్డారు. సమయం తక్కువగా ఉండటంతో బొల్లారం ఏసీపీ రమేశ్‌కుమార్.. రాష్ట్రపతి నిలయం గేటు తెరిపించి మరీ పోలీసు వాహనంలో షార్ట్‌కట్‌లో బొల్లారం సెంటర్‌కు తీసుకెళ్లారు. రంగారెడ్డి జిల్లాలో రాగన్నగూడ జెడ్పీ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రం వచ్చిన అచ్చంపేట విద్యార్థి నరేందర్ తెలివిగా కాపీ కొట్టేందుకు ప్రయత్నించి పట్టుబడ్డాడు. పరీక్షా కేంద్రం వివరాలు తెలుసుకున్న విద్యార్థి ఉదయమే స్కూల్ వద్దకు వచ్చాడు. తన ఫోన్‌ను నీటిలో వేసినా తడవని విధంగా జిప్‌లాక్ కవర్‌లో ఉంచి.. ప్రహరీకి ఆనుకొని ఉన్న బాత్రూమ్ వెంటిలేటర్‌లో పెట్టాడు. మెయిన్ గేట్ నుంచి తనిఖీలు పూర్తి చేసుకొని పరీక్ష కేంద్రంలోకి వెళ్లాడు. కాసేపటికి బాత్రూమ్‌లోకి వెళ్లి ఫోన్‌ను ఫ్లష్ ట్యాంకులో దాచాడు. ఉదయం 11 గంటల సమయంలో బాత్రూముల వద్ద సిబ్బంది తనిఖీలు చేసినా ఫోన్‌ను గుర్తించలేకపోయారు.

# మూసీ విధ్వంసంతో.. మహాత్ముడి ఆత్మఘోష

(మొదటి పేజీ తరువాయి)

ప్రేమ ఉంటే పేదల ఇండ్లు కూల్చకుండా మహాత్ముడి విగ్రహం పెట్టాలని సూచించారు. 'చివరికి పిల్లలు సైతం తమ ఇండ్లు కూలగొట్టవద్దు.. కిడ్డీ బ్యాంక్ డబ్బులైనా ఇస్తాం.. మమ్మల్ని వదిలిపెట్టండి' అని వేడుకున్నా మనసు కరగని దుర్మార్గపు పాలన కొనసాగుతున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం శంషాబాద్ జేడీ కన్వెన్షన్‌లో రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. మూసీ పేరుతో కాంగ్రెస్ చేస్తున్న విధ్వంస రాజకీయాలకు బీజేపీ కూడా మద్దతు ఇస్తున్నదని కేటీఆర్ ఆరోపించారు. చోటే భాయ్.. బడే భాయ్ ఇద్దరూ కలిసి మూసీ భూములు కూలగొడుతున్నారని విమర్శించారు. నిజంగానే మోదీకి నిజాయితీ ఉంటే పేదల భూములు లాకోవద్దని, పేదలకు అన్యాయం చేయవద్దని ఎందుకు ప్రశ్నించరు అని నిలదీశారు. ఒకవైపు స్థానికంగా మూసీ ప్రజలను మోసం చేస్తున్నారని స్థానిక బీజేపీ నేతలు ఈటల రాజేందర్, కిషన్‌రెడ్డి మాట్లాడుతుంటే.. కేంద్రంలోని ఉన్న బీజేపీ ప్రభుత్వం మాత్రం ఇండ్లు కూలగొట్టమని అనుమతులు ఇస్తుందని కేటీఆర్ మండిపడ్డారు. రెండున్నరేండ్లు దాటినా ఒక హామీ కూడా నెరవేర్చేందుకు డబ్బులు లేవని చెబుతున్న రేవంత్‌రెడ్డి.. మూసీ కోసం మాత్రం లక్షన్నర కోట్లు ఖర్చు పెట్టేందుకు సిద్ధమవుతున్నారని దుయ్యబట్టారు. కేవలం రాహుల్‌గాంధీకి ప్రతినెలా కమీషన్లు పంపేందుకే రేవంత్‌రెడ్డి ఇన్ని అరాచకాలు చేస్తున్నారని, డబ్బు కట్టలు పంపి రెన్యువల్ చేసుకోకుంటే ముఖ్యమంత్రి పదవి పోతుందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఒక సినిమా ఫెయిల్ అయితే ప్రొడ్యూసర్లకు నష్టం వస్తుందని, కానీ ఇప్పుడు నడుస్తున్న రేవంత్‌రెడ్డి అనే సినిమాతో 4కోట్ల తెలంగాణ ప్రజలకు నష్టం వస్తుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇప్పటికే కాంగ్రెస్ సినిమా సగం అయిపోయిందని అది పూర్తి అట్టర్‌ఫ్లాప్ సినిమా అని ఎద్దేవా చేశారు. 'అది డిజాస్టర్ అని అందరికీ తెలిసిపోయింది.. ఇంటర్వెల్ అయిపోగానే ఎప్పుడు పోతడు రా రేవంత్‌రెడ్డి అని అందరూ తలపట్టుకొని కూర్చున్నరు' అంటూ సెటైర్ వేశారు. మూసీలో ఖర్చు పెడుతున్న రూ.లక్షన్నర కోట్లతో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసే ప్రయత్నం చేయాలని కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్ పోవాలి.. కేసీఆర్ రావాలనే ఏకైక ఆలోచన ప్రజల్లో ఉన్నదని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం లేదని కేవలం ఒక మాఫియా రాజ్యం నడుస్తున్నదని కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దండుపాళ్యం ముఠాకు నాయకుడిలా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తుంటే.. ఆయన ఆధ్వర్యంలో దోచుకో.. దాచుకో అన్నట్టుగా మంత్రులంతా కలిసి స్కామ్‌లు చేస్తున్నారని విమర్శించారు. సామాన్యుల భూములు లాకొని గూండాయిజం చేసే రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కొడుకు గూండాయిజాన్ని ప్రతి ఒకరూ చూశారని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ కనుసన్నల్లోనే శంషాబాద్‌లో 180 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు రాసిచ్చిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. రెండున్నరేండ్లుగా హైదరాబాద్‌లో ఒక ఇల్లు కూడా కట్టని కాంగ్రెస్ ప్రభుత్వం.. వేలాది ఇండ్లను కూల్చేందుకు మాత్రం సిద్ధమవుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఉన్న సిటీని వదిలిపెట్టి కేవలం తాను కబ్జా చేసిన వేలాది ఎకరాలను కాపాడుకునేందుకే ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌పై కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అభివృద్ధి పేరుతో పార్టీ మారితే ఈ రెండున్నరేండ్లలో చేసిన ఒక్క అభివృద్ధి పని అయినా చెప్పగలరా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ రాజేంద్రనగర్ ప్రజలకు ద్రోహం చేశాడని విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యే పోయినా బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి ఢోకా లేదని, రాజేంద్రనగర్‌లో పార్టీ బాధ్యతలు కార్తిక్‌రెడ్డి భుజాల మీద ఉన్నదని కేటీఆర్ చెప్పారు. రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌ని తిరిగి ముఖ్యమంత్రిగా చేసి గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)పై కార్యకర్తలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏడుగురిని బలిగొన్న విష వాయువు

**చెన్నై, జూన్ 21:** తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట తాలూకా కన్నిగైపేర్ ప్రాంతంలో ఓ ప్రైవేట్ రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో ఆదివారం ఉదయం అమ్మోనియా గ్యాస్ లీకై ఏడుగురు కార్మికులు మృతి చెందారు. పదుల సంఖ్యలో తీవ్ర అస్వస్థతకు గురై ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో పలువురి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నటుజ్జి అధికారులు తెలిపారు. కన్నిగైపేర్ ప్రాంతంలో 'సెయింట్ పీటర్ అండ్ పాల్ సీ ఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీని నడుపుతున్నారు. ఆ కంపెనీలో ప్రతిరోజూ రెండు షిఫ్టుల్లో 200 మందికి పైగా కార్మికులు పనిచేస్తుంటారు. వీరిలో ఎక్కువ మంది అసోం, ఒడిసా, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులే. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం సుమారు 120 మంది విధులకు హాజరయ్యారు. ఆ సమయంలో రొయ్యలు నిల్వ చేసే విభాగం నుంచి అమ్మోనియా వాయువు వెలువడింది. దానిని పీల్చిన సుమారు 60 మంది ఊపిరాడక తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కంపెనీ నిర్వాహకులు అస్వస్థతకు గురైన వారిని వెంటనే మంజకరణై ప్రాంతంలో ఉన్న వేల్స్ హాస్పిటల్, వెంకటేశ్వర హాస్పిటల్‌కు తరలించారు. ఈ క్రమంలో వేల్స్ హాస్పిటల్‌లో అత్యవసర చికిత్స విభాగంలో చికిత్స పొందుతూ ఆరుగురు, వెంకటేశ్వర హాస్పిటల్‌లో మరొకరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమంగా ఉన్నవారిని చెన్నై స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి, రాజీవ్ గాంధీ స్మారక సర్వజన ఆసుపత్రి (జీహెచ్)కి తరలించారు. రాజీవ్‌గాంధీ స్మారక సర్వజన ఆసుపత్రిలో 9 మంది మహిళా కార్మికులు చికిత్స పొందుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో సుమారు పది మంది ఆరోగ్య పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యులు ప్రకటించారు. కాగా.. రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీ యజమాని మోహన్, ఆయన సోదరుడు జోసెఫ్‌ను పెరియపాళయం పోలీసులు అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు.. ఆ కంపెనీ నుంచి రోజూ రాత్రి పూట విషవాయువులు వెలువడుతున్నాయని, ఈ విషయమై ప్రభుత్వ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కన్నిగైపేర్ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో అమ్మోనియా గ్యాస్ లీకైన సమాచారం తెలియగానే అరక్కోణం నుంచి జాతీయ విపత్తుల ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) సభ్యులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్యాస్ లీకైన ప్రాంతాన్ని పరిశీలించి, లీకేజి నియంత్రణ చర్యలు చేపట్టారు. కార్మికుల మరణంపై తమిళనాడు గవర్నర్ ఆర్వీ ఆర్లేకర్, సీఎం విజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి విజయ్ కార్మిక భద్రత శాఖ, ఆరోగ్య శాఖ, కాలుష్య నియంత్రణ మండలి సభ్యులతో వెంటనే విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని ఉత్తర్వు జారీ చేశారు. ఈ త్రిసభ్య కమిటీ విచారణ జరిపి 24 గంటల్లోపు ప్రభుత్వానికి మధ్యంత నివేదిక సమర్పించాలని, మూడు రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. అమ్మోనియా లీక్ ఘటనపై సీఎం విజయ్ ఆదేశా మేరకు సమగ్ర విచారణ జరుపనున్నట్టు రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ మంత్రి పర్వేజ్ ప్రకటించారు. ఆ మేరకు చెన్నైలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి (జీహెచ్) డీన్ శాంతారామ్ అధ్యక్షతన విచారణ కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీ విచారణ జరిపి త్వరలో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని చెప్పారు. గ్యాస్ లీక్‌కు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

## సముద్ర రంగంలో నిర్ణాయక శక్తిగా భారత్!

(మొదటి పేజీ తరువాయి)

నౌకలను ప్రధాని మోదీ ఆదివారం ప్రారంభించి.. జాతికి అంకితం చేశారు. కోల్‌కతాలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోర్టు వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సముద్ర రంగం రానున్న రోజుల్లో దేశంలో లక్షలాది మందికి ఉపాధి కల్పించే ఎంప్లాయ్‌మెంట్ ఇంజిన్‌గా మారనుందని చెప్పారు. భవిష్యత్తులో సముద్ర రంగంలో భారత్ ప్రపంచ స్థాయి నిర్ణయకర్తగా మారుతుందని, ఆ దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. కాగా, స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ మూడు యుద్ధ నౌకల చేరికతో నౌకాదళ బలం మరింత పెరగనుంది. ప్రధాని మోదీ ప్రారంభించిన మూడు నౌకల్లో ఐఎన్ఎస్ దునగిరి పెద్దది. ఇదొక స్టెల్త్ ఫ్రిగేట్ నౌక. శత్రువుల రాడార్లు, సెన్సర్లకు చిక్కకుండా అధునాతన టెక్నాలజీతో దీన్ని నిర్మించారు. తీరానికి చాలా దూరంలో పనిచేసేలా దీన్ని తయారు చేశారు. నేవీలో విశిష్ట సేవలందిం చిన ఐఎన్ఎస్ నీలగిరి శ్రేణిగా ప్రాజెక్ట్ 17ఏలో భాగంగా దునగిరిని ఎంతో ప్రత్యేకంగా నిర్మించారు. దీనిలో బ్రహ్మోస్ క్షిపణులతోపాటు మధ్యశ్రేణి మిస్సైల్స్ వంటి ఆయుధాలు, మల్టీ ఫంక్షన్ సర్వైలెన్స్, ట్రాక్ అండ్ గైడెన్స్ రాడార్, సోనార్, సెన్సర్లు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థలు, జలాంతర్గామి వ్యతిరేక ఆయుధాలు ఉన్నాయి. 149 మీటర్ల పొడవు, 6,670 టన్నుల బరువుండే ఈ నౌక గంటకు 28 నాటికల్ మైళ్ల (52 కి.మీ.) వేగంలో ప్రయాణించగలదు. భారత నౌకాదళం కోసం ప్రత్యేకంగా నిర్మించిన అత్యాధునిక హైడ్రోగ్రాఫిక్ సర్వే నౌక ఐఎన్ఎస్ సంశోధక్. సముద్ర గర్భాన్ని మ్యాపింగ్ చేయడా నికి, మహాసముద్రాల లోతును కొలవడానికి, కొత్త సముద్ర మార్గాలను అన్వేషించడానికి ఉపయోగపడుతుంది. ఇది 110 మీటర్ల పొడవు, 3400 టన్నుల బరువు ఉంటుంది. గంటకు 33 కి.మీ. (18 నాటికల్ మైళ్లు) వేగంతో ప్రయాణిస్తుంది. ఈ నౌక ద్వారా రక్షణ, పౌర అవసరాల కోసం విలువైన సము ద్రగర్భ సమాచారాన్ని సేకరించవచ్చు. నీటి అడుగున మ్యాపిం గ్ చేయడానికి, దూర ప్రాంతాల సమాచారాన్ని సేకరించడానికి ఉపయోగపడే అటానమస్ అండర్ వాటర్ వెహికిల్స్ (ఏయూవీ) దీనిలో ఉన్నాయి. అలాగే మానవ ప్రమేయం లేకుండా నీటి అడుగున పరిశోధనలు చేయడానికి వీలుగా రిమోట్‌తో నడిచే యంత్రాలు కూడా ఉన్నాయి. ఐఎన్ఎస్ దునగిరి, ఐఎన్ఎస్ సంశోధక్‌తో పోలిస్తే అగ్రయ్ చిన్న నౌక అయినప్పటికీ.. అత్యంత కీలక పాత్ర పోషిస్తుంది. ఇదొక జలాంతర్గామి విధ్వంసక యుద్ధనౌక. శత్రు జలాంతర్గాములను గుర్తించడం, వాటిని ట్రాక్ చేయడం, అధునాతన తేలిక పాటి టార్పెడోలు లేదా రాకెట్ల ద్వారా వాటిని ధ్వంసం చేయడం దీని విధి. దీనిలో నిస్సార జలాల్లో పనిచేయగల అత్యంత శక్తివంతమైన షాలో వాటర్ సోనార్ వ్యవస్థ ఉంది.



### భర్తతో ఘర్షణ..
## ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తానూ ఆత్మహత్యాయత్నం

**ఖమ్మం, జూన్ 21 (వార్త వేదిక సూర్య):**

'అమ్మా.. మేమేం నేరం చేశామమ్మా? నీ పేగు తెంచుకొని పుట్టిన మమ్మల్ని నీ చేత్తోనే ఎలా చిదిమేయగలిగావమ్మా? నీకు, నాన్నకు మధ్య వచ్చిన మనస్పర్థలకు మేమెలా బాధ్యులం అవుతామమ్మా? నీ కడుపున పుట్టినందుకు మాకు ఇంత శిక్ష వేశావేంటమ్మా?' అంటూ కన్నుమూసిన చిన్నారులు తమ కన్నతల్లిని అడుగుతున్నట్టుగా వారి కుటుంబీకులు చేస్తున్న ఆర్తనాదాలు, శోకసంద్రంలో వేస్తున్న ప్రశ్నలు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తున్నాయి. స్వగ్రామానికి మకాం మార్చే విషయంలో భర్తతో ఓ భార్య పడిన ఘర్షణ చివరికి వారి పిల్లల ప్రాణాలను తీసేదాకా వెళ్లిన ఘటన ఖమ్మం జిల్లా కేంద్రంలో వెలుగుచూసింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు .. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ గుర్రాలపాడుకు చెందిన బొబ్బిలి లింగరాజు, స్వాతి దంపతులు కొద్ది నెలలుగా ఖమ్మం త్రీటౌన్ గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి వేదక్‌కుమార్ (7), తనీశ్ (4) అనే కుమారులున్నారు. లింగరాజు ఓ సెల్‌ఫోన్ షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా షాపు నడుపలేనని, ప్రత్యామ్నాయ ఉపాధి చూసుకోవాలని లింగరాజుకు సెల్‌ఫోన్ షాపు యజమాని చెప్పాడు. లింగరాజు ఇదే విషయాన్ని భార్యకు చెప్పాడు. స్వగ్రామానికి వెళ్లి వేరే పని చూసుకుందామని చెప్పగా భార్య స్వాతి నిరాకరించింది. ఇదే విషయమై రెండు రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భర్తపై కోపం పెంచుకున్న భార్య.. శనివారం లింగరాజు ఇంట్లో లేని సమయం చూసి.. బిస్కెట్లకు ఎలుకలమందు పూసి పిల్లలకు తినిపించింది. అనంతరం ఏమీ తెలియనట్టు భర్తకు ఫోన్ చేసింది. పిల్లలకు వాంతులు అవుతున్నాయని, త్వరగా ఇంటికి రావాలని చెప్పింది. దీంతో హుటాహుటిన ఓ మెడికల్ షాపునకు వెళ్లిన లింగరాజు.. వాంతులు తగ్గేందుకు ఓ సిరప్ తీసుకొని ఇంటికి వచ్చాడు. పిల్లలకు తాగించి పడుకోబెట్టాడు. విష ప్రభావంతో పెద్ద కుమారుడు వేదక్‌కుమార్ శనివారం రాత్రి నిద్రలోనే కన్నుమూశాడు. చిన్న కుమారుడు తనీశ్‌కు ఆదివారం ఉదయం వాంతులు కావడంతో ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ మరణించాడు. పిల్లల పరిస్థితి విషమిస్తున్న తరుణంలో స్వాతి సైతం ఎలుకలమందు తినడంతో స్థానికులు ఆమెను దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నది. ఖమ్మం త్రీటౌన్ పోలీసులు విచారణ చేపట్టారు. ఫాదర్స్‌డే రోజున ఓ తండ్రి తన పిల్లలను కోల్పోవడం విషాదాన్ని మిగిల్చింది.




# కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో యోగా దినోత్సవ వేడుకలు

**- ముఖ్య అతిథిగా పాల్గొని యోగాసనాలు వేసిన ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్**

**- యోగా గురువు భద్రయ్య ఆధ్వర్యంలో వైభవంగా సాగిన వేడుకలు**

**- తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, వందలాది మంది సాధకులు**

రాజేంద్రనగర్, జూన్ 21 ( వార్త వేదిక సూర్య ) :

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వామి వివేకానంద యోగ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో యోగా వేడుకలు అత్యంత వైభవంగా, జనసందోహం మధ్య జరిగాయి. యోగ గురువు భద్రయ్య పర్యవేక్షణలో వేకువజామున 6 గంటలకే ప్రారంభమైన ఈ సామూహిక యోగా సాధన కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ శాసనసభ్యులు టి. ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా సాధకులతో కలిసి యోగాసనాలు వేసి అందరిలో ఉత్సాహాన్ని నింపారు..ఆనంతరం ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... మానవాళికి భారతదేశం అందించిన అత్యద్భుతమైన వరం యోగా అని కొనియాడారు. కేవలం



శారీరక దృఢత్వానికే కాకుండా, మానసిక ప్రశాంతతకు, ఆధ్యాత్మిక ఉన్నతికి యోగా అత్యుత్తమమైన సాధనమని స్పష్టం చేశారు. నేటి ఆధునిక కాలంలో మారుతున్న జీవనశైలి, ఒత్తిళ్లను జయించాలంటే ప్రతి ఒక్కరూ వయసుతో నిమిత్తం లేకుండా నిత్య జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ అంతర్జాతీయ లైఫ్ కోచ్, యోగా శిక్షకులు మహేంద్ర గురువు పాల్గొని యోగా యొక్క ప్రాముఖ్యతను శాస్త్రీయంగా వివరించారు. నిత్యం యోగా చేయడం వల్ల కండరాల పుష్టి, ఎముకల దృఢత్వం పెరగడమే కాకుండా, జ్ఞాపకశక్తి అద్భుతంగా మెరుగవుతుందని తెలిపారు. నిత్యం ఒత్తిడితో సతమతమయ్యే వారికి యోగా ద్వారా సంపూర్ణ మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. మన భారతీయ సంస్కృతికి, వారసత్వానికి నిలువెత్తు ప్రతీక అయిన యోగా విద్యను నేడు ప్రపంచవ్యాప్తంగా వందలాది దేశాలు గుర్తించి, ఆచరిస్తుండటం ప్రతి భారతీయుడికి గర్వకారణమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. యోగా గురువు భద్రయ్య మాట్లాడుతూ... భారతీయ ఋషులు, మునులు సమాజానికి అందించిన అమూల్యమైన జీవన వేదం యోగా అని తెలిపారు. యోగా అనేది కేవలం కొన్ని ఆసనాలు వేయడం మాత్రమే కాదని, అది శరీరాన్ని, మనస్సును మరియు ఆత్మను అనుసంధానించే ఒక గొప్ప జీవన విధానమని పేర్కొన్నారు. నేటి యాంత్రిక జీవనంలో మనుషులు మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారని, నిత్యం కనీసం అర గంట పాటు యోగాసనాలు, ప్రాణాయామం సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సిద్ధింపజేసుకోవచ్చని వివరించారు. కాటేదాన్ పరిసర ప్రాంతాల ప్రజలు ఇంత పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ వేడుకలను విజయవంతం చేయడం అభినందనీయమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ టి. ప్రేమ్ రాజ్ గౌడ్, ప్రముఖ నాయకులు టి. ప్రేమ్ గౌడ్, అర్థం లక్ష్మయ్య గుప్తా, ధనుంజయ గౌడ్, సోమ శ్రీనివాస్ గుప్తా, సరాబు అనంత గుప్త, ఎల్లప్ప, బండారి కృష్ణయ్య, వెంకటేశ్వరరావు, రవీందర్, వీరేందర్, విజయలక్ష్మి, శోభారాణి తదితర స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.




## ప్రజారోగ్య రక్షణే లక్ష్యం..

**నాన్‌వెజ్ మార్కెట్లలో జి హెచ్ ఎం సి పరిశుభ్రత తనిఖీలు**

**-భవాని కాలనీ, రాజేంద్రనగర్, ప్రేమావతిపేట్ ప్రాంతాల్లో వ్యాపారులకు అవగాహన**

**-నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

రాజేంద్రనగర్, జూన్ 21 ( వార్త వేదిక సూర్య ) :

ప్రజారోగ్యం, ఆహార భద్రత పరిరక్షణ లక్ష్యంగా జీహెచ్ఎంసీ అధికారులు భవాని కాలనీ, రాజేంద్రనగర్, ప్రేమావతిపేట్ ప్రాంతాల్లో చేపలు, మాంసం విక్రయించే నాన్‌వెజ్ వ్యాపారులను పరిశీలించారు. పరిశీలన సందర్భంగా పరిశుభ్రత ప్రమాణాల అమలు, విక్రయ కేంద్రాల పరిశుభ్ర నిర్వహణ, వ్యర్థాల సక్రమ నిర్వహణ, తూకం యంత్రాలు మరియు ఇతర పరికరాల శుభ్రతపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించేందుకు తప్పనిసరిగా పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు.అలాగే జీహెచ్ఎంసీ చట్టం, ఆహార భద్రతా నిబంధనల మేరకు వ్యాపారులు తమ దుకాణాలను నిర్వహించాలని, ప్రజారోగ్యానికి హాని కలిగించే పరిస్థితులు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం, వినియోగదారుల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

## ప్రేమావతిపేటలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

రాజేంద్రనగర్, జూన్ 21 ( వార్త వేదిక సూర్య ) :





భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రేమావతిపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని అన్నారు. యోగాభ్యాసం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు క్రమశిక్షణ, ఏకాగ్రత, మంచి అలవాట్లు అలవడ తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా యోగా గురువులు మూల్ చంద్ శర్మ, అజిత్ సింగ్, హరి కిషన్‌లను సన్మానించారు. కార్యక్రమంలో సోల్కర్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, పద్మావతి, భవానీ దాస్, నారతం రెడ్డి, మురళీ మోహన్, ఆగపల్లి నరసింహ, దయానంద్, జంగయ్య, యాదగిరి యాదవ్, ఈశ్వర్, రాజు రెడ్డి, భాషతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహణ

**- బాబుల్ రెడ్డి నగర్‌లో యోగా కార్యక్రమంలో పాల్గొన్న తోకల శ్రీనివాస్ రెడ్డి**

రాజేంద్రనగర్, జూన్ 21 ( వార్త వేదిక సూర్య ) :



దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో అభివృద్ధి ఆధారిత పాలన విజయవంతంగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న విజయోత్సవ కార్యక్రమాలలో భాగంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు పాండు యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.బాబుల్ రెడ్డి నగర్‌లోని బొడ్రాయి చౌరస్తాలో జై గురుదేవ్ యోగ గ్రూప్ గురువులు విజయకుమార్, విమలల నేతృత్వంలో నిర్వహించిన ఈ యోగా కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ నేత, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. యోగా మనిషిని శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంచుతుందని, ప్రతిరోజూ యోగాసనాలు చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. యోగా వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వెంకటరమణ గుప్తా, రావుల భాస్కర్, మురళీధర్ రెడ్డి, సంతు గౌడ్, మధుసూదన్ రెడ్డి, రామారావు, శేఖర్, రమేష్ రెడ్డి, శంకర్ రాజు, స్వామి, కిరణ్, రాజలింగం, శంకర్ రెడ్డి, డివిజన్ నాయకులు, బస్తీ నాయకులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# అరుణ బుద్ధారెడ్డి ఆధ్వర్యంలో యోగా వేడుకలు

రాజేంద్రనగర్, జూన్ 21 ( వార్త వేదిక సూర్య ) :

ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని అత్తాపూర్ ప్రాంతంలో ఉన్న యాక్టివ్ రూట్స్ స్టూడియోలో ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇండియాస్ ఫస్ట్ వరల్డ్ కప్ మెడలిస్ట్ అరుణ బుద్ధా రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యోగా సాధకులు, యువత, మహిళలు ఉత్సాహంగా హాజరైయ్యారు.కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ వివిధ యోగాసనాలు, ప్రాణాయామాలు నిర్వహించి యోగా ప్రాముఖ్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా అరుణ బుద్ధారెడ్డి మాట్లాడుతూ యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను అందించే జీవన విధానమని పేర్కొన్నారు. నేటి వేగవంతమైన జీవితంలో ఒత్తిడి, ఆందోళనల నుంచి ఉపశమనం పొందేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందని ఆమె అన్నారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ కొంత




సమయం యోగాసనాలు, ధ్యానం కోసం కేటాయించడం ద్వారా ఆరోగ్యవం తమైన సమాజ నిర్మాణానికి తోడ్పడవచ్చని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం పాల్గొన్న వారిలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు యోగా పట్ల మరింత ఆసక్తిని కలిగించింది.



## టీఎన్జీవోఎస్ కాలనీలో జగన్నాథుని ఆలయ పూజా కార్యక్రమం

**- పూజా కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకుడు విజయ్ కుమార్**

రాజేంద్రనగర్, జూన్ 21 ( వార్త వేదిక సూర్య ) :

అత్తాపూర్ సర్కిల్ మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో టీఎన్జీవోఎస్ కాలనీలోని శ్రీ జగన్నాథుని ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు విజయ్ కుమార్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, ప్రజల సుఖశాంతులు, రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాల కోసం ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రముఖులు పాల్గొని జగన్నాథుని ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమం స్థానికులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఓల్డ్ కర్నూల్ రోడ్డుపై డ్రైనేజీ దుస్థితి

**- పట్టించుకోని అధికారులు, నరకయాతనలో ప్రజలు!**

**- తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలి**

**- స్థానికులు, ప్రయాణికుల డిమాండ్**

రాజేంద్రనగర్, జూన్ 21 ( వార్త వేదిక సూర్య ) :

ఓల్డ్ కర్నూల్ రోడ్డుపై నెలకొన్న డ్రైనేజీ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతూ స్థానికులు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఇండస్ట్రియల్ ప్రాంతంగా పేరుగాంచిన ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు, ఉద్యోగులు, సాధారణ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపైనే డ్రైనేజీ నీరు ప్రవహిస్తుండటంతో రోడ్డు మొత్తం బురదమయంగా మారుతోంది. దుర్వాసనతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు, ఈగలు పెరిగి అంటు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారో గ్యానికి ముప్పుగా మారుతున్న ఈ సమస్యపై సంబంధిత అధికారులు ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై అనేక చోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. వర్షం పడినప్పుడు గుంతలు నీటితో నిండిపోవడంతో అవి కనిపించక ప్రమాదాలు మరింత



పెరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పలుమార్లు చిన్నచిన్న ప్రమాదాలు జరిగినప్పటికీ అధికారులు స్పందించకపోవడం బాధాకరమని అంటున్నారు. ఇండస్ట్రియల్ ప్రాంతం కావడంతో భారీ ట్రక్కులు, లారీలు నిరంతరం ఈ మార్గంలో ప్రయాణిస్తుంటాయి. అయితే డ్రైనేజీ మూతలు దెబ్బతినడం, కొన్ని చోట్ల లేకపోవడం వల్ల ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. నాణ్యమైన డ్రైనేజీ మూతలను ఏర్పాటు చేసి, మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజలు ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య అలాగే కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించడంతో పాటు రహదారి మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఉపశమనం కల్పించాలని స్థానికులు, ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఓల్డ్ కర్నూల్ రోడ్డు ప్రజలకు నరకయాతనగా మారింది. ప్రమాదాలు జరిగాక స్పందించకుండా, ముందస్తుగా చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలి అని స్థానికులు కోరుతున్నారు. సమస్య మరింత జటిలం కాకముందే తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయం

రాజేంద్రనగర్, జూన్ 21 ( వార్త వేదిక సూర్య ) :



తెలంగాణ సిద్ధాంతకర్త, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శకుడైన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఆయనకు ఘనంగా నివాళులు అర్పిస్తున్నారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పోరాడిన జయశంకర్ సార్ ఎన్నో ఉద్యమాలు, దీక్షలు నిర్వహించి, తన మేధస్సు, ఆలోచనలతో తెలంగాణ ఆకాంక్షను ప్రజల్లో బలంగా నాటారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పలువురు నాయకులు, ఉద్యమకారులు కొనియాడుతున్నారు.ప్రత్యేక తెలంగాణ కల సాకారమైన వేళను ప్రత్యక్షంగా చూడలేక పోయినప్పటికీ, ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు తెలంగాణ ఉద్యమానికి శాశ్వత స్ఫూర్తిగా నిలిచాయి. తెలంగాణ రాష్ట్ర నిర్మాణానికి పునాదులు వేసిన మహనీయుడిగా జయశంకర్‌ను ప్రజలు స్మరించుకుంటున్నారు. ఈ సందర్భంగా పలువురు తెలంగాణ ఉద్యమ వీరులు, ప్రజాప్రతినిధులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడ రాజీవ్ గృహకల్పలో తీవ్రమైన తాగునీటి, డ్రైనేజీ సమస్యలు

**- ప్రజల ధర్నాకు మద్దతు తెలిపిన కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి**

**- సమస్యలు పరిష్కరించకుంటే ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరిక**

రాజేంద్రనగర్, జూన్ 21 ( వార్త వేదిక సూర్య ) :

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ రాజీవ్ గృహకల్ప (పింక్ క్వార్టర్స్) ప్రాంతంలో ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీరు, భూగర్భ డ్రైనేజీ సమస్యలపై అధికారులకు, పాలకులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు తీరకపోవడంతో కాలనీవాసులు నిరసన ధర్నా చేపట్టగా, వారికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి అక్కడికి చేరుకొని పూర్తి సానుభూతిని, మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో తాగునీరు లేక పేద ప్రజలు, మహిళలు బిందెలు పట్టుకుని తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఓట్లేయించుకుని గెలిచిన స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కి ఇక్కడి ప్రజలంటే అంత చులకనా అని మండిపడ్డారు. ఇన్ని వందల కుటుంబాలుసమస్యలతో నరకం చూస్తున్నా, ఎమ్మెల్యే ఒక్కసారైనా ఈ ఏరియాకు వచ్చి ప్రజల కష్టాలు అడిగి తెలుసు కున్నారా అని ప్రశ్నించారు. సుమారు 36 బ్లాకుల్లోని 900కు పైగా పేద కుటుంబాల ప్రాణాలకు, బతుకులకు పాలకుల వద్ద విలువ లేదా అని ఆయన నిలదీశారు.

రాష్ట్రంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ‘స్మార్ట్ సిటీ’, ‘ఫ్యూచర్ సిటీ’ అంటూ గొప్పలు చెప్పుకుంటూ, సీఎం, సీఈఓ అంటూ మాటలకే పరిమితమవుతోందే తప్ప.. నగరం నడిబొడ్డున ఉన్న కాలనీ ప్రజలకు కనీసం మంచి నీటిని కూడా అందించలేకపోతోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు పడుతున్న నీటి అవస్థలు



స్థానిక ఎమ్మెల్యేకు, అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించిన ఆయన, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ మరియు అధికారుల వైఫల్యమేనని దుయ్యబట్టారు. ధర్నాలో మహిళలు, అక్కాచెల్లెమ్మలు తమ ఆవేదనను వ్యక్తపరుస్తూ.. ఈ ప్రాంతం గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా మారిందని, రక్షణ లేక ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతకాల్సి వస్తోందని కన్నీరు పెట్టుకోవడం అత్యంత బాధాకరమన్నారు. ఇంత జరుగుతున్నా పోలీస్ వ్యవస్థ నిద్రపోతుందా అని మండిపడ్డారు. స్థానికులెవరూ అధైర్యపడవద్దని, శాంతిభద్రతల సమస్యపై, తాగునీటి సమస్యపై తాను ముందుండి సరైన పరిష్కారం తీసుకువస్తానని హామీ ఇచ్చారు.

వెంటనే ప్రభుత్వం దిగివచ్చి కాలనీకి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో స్థానిక ప్రజలందరినీ సమీకరించి జలమండలి, మున్సిపల్ కార్యాలయాల ముందు ధర్నా చేపట్టి అధికారులు ఎలా విధులు నిర్వహిస్తారో చూస్తామని హెచ్చరించారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఇక్కడికి వచ్చి సమస్యను పరిష్కరించకపోతే, కాలనీవాసులంతా తరలివచ్చి ఆయన ఇంటి ముందు ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. పేద ప్రజల ఉసురు పోసుకోకుండా తక్షణమే నీటి సౌకర్యం కల్పించకపోతే ఈ నిరసన పెద్ద ఎత్తున ఉద్యమంగా మారుతుందని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీనియర్ నాయకులు బుచ్చి రెడ్డి, రావుల భాస్కర్, డివిజన్ మాజీ అధ్యక్షుడు అడికే జనార్ధన్, తలారి చిన్న, బబ్లూ, నర్సి రెడ్డి, ఎల్‌వి రెడ్డి, పృథ్వీ రాజ్, అడికే శివ, నర్సింహ రెడ్డి, సచిన్, బి. రామకృష్ణ, ఎన్ను శంకర్ రెడ్డి, రమేష్ రెడ్డి, రాజేష్, శ్రీనివాస్ రెడ్డి, నరేష్, చెన్నయ్య, రవి, సురేష్, అలాగే కాలనీ నాయకురాళ్లు అంజమ్మ, లత, యాదమ్మ, పద్మ, పుష్ప మరియు స్థానిక మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని నిరసన తెలిపారు.

## ప్రజల ఇబ్బందులు అర్థం చేసుకోండి..

**బాబుల్ రెడ్డి నగర్ డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపండి!**

రాజేంద్రనగర్, జూన్ 21 ( వార్త వేదిక సూర్య ) :



రాజేంద్రనగర్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్య స్థానికులకు శాపంగా మారింది. రహదారులపై పారుతున్న మురుగునీరు, వెదజల్లుతున్న భరించలేని దుర్వాసనతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఆరోగ్య సమస్యల భయంతో ఆందోళన చెందుతున్నారు.డ్రైనేజీ నీరు నిల్వ ఉండటంతో దోమలు పెరిగి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ ఇదే సమస్యను ఎదుర్కొంటూ జీవనం సాగించడం కష్టంగా మారిందని వాపోతున్నారు. ఈ ప్రాంతం గుండా ప్రయాణించే వాహనదారులు, పాదచారులు కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రజల ఆరోగ్యం కంటే ముఖ్యమైనది మరొకటి లేదని, సమస్య తీవ్రతను గుర్తించి సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులతో కాకుండా శాశ్వత పరిష్కారం చూపి బాబుల్ రెడ్డి నగర్ ప్రజలకు ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సోమవారం
జూన్ 22, 2026
సంపుటి : 2 సంచిక : 33
Follow:



## స్వయం ఉపాధితోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు

### ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్

### ఆదిత్య డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం

చౌటుప్పల్ జూన్ 21(వార్తా వేదిక సూర్య)

యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలని ఇ.ఎల్.వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని చిన్నకొండూర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిత్య డయాగ్నోస్టిక్ సెంటర్'ను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు.ఆయనతో పాటు ఫౌండేషన్ సభ్యులు రక్త పరీక్షలు చేయించుకున్నారు. ప్రారంభోత్సవ కానుకగా 20,000 వేల రూపాయలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ముందస్తు ఆరోగ్య పరీక్షలు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. యువత కేవలం ఉద్యోగాల కోసమే వేచి చూడకుండా, స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని తోటి వారికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ, ప్రజల నమ్మకాన్ని పొందాలని సూచించారు. విద్యా, వైద్యం, ఉపాధి కల్పనకు ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు.

## దివిష్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఘనంగా యోగా దినోత్సవం.



చౌటుప్పల్ జూన్ 21 వార్తా వేదిక సూర్య

అంతర్జాతీయ యోగా దినోత్సవం దివిస్ పరిశ్రమలో ఆదివారం యోగా గురువు పాలకూరల పాండు ఆధ్వర్యంలో పరిశ్రమ ఉద్యోగులందరూ యోగాసనాలు చేశారు అనంతరం యోగా గురువు పాలకూరల పాండు మాట్లాడుతూ ఉద్యోగులు ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు పరిశ్రమలో పనిచేయడం వలన ఆరోగ్యం ఉండడానికి ప్రతిరోజు ఉదయం 10 నిమిషాలు యోగ చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యంతో పాటు సంతోషంగా ఉల్లాసంగా ఉంటారని అన్నారు అందువలన పరిశ్రమలోని ఉద్యోగులందరూ ప్రతిరోజు ఉదయం యోగ చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో
మేనేజర్ మురళీకృష్ణ నాగమల్లేశ్వరరావు డిప్యూటీ జనరల్ ప్రొడక్షన్ మరియు డి శ్రీనివాస్ డి జి ఎం మరియు శివప్రసాద్ ఏజీఎం మరియు ఏది రావు సీనియర్ మేనేజర్ ప్రొడక్షన్ మరియు ఏ శ్రీధర్ రావు మరి ఉద్యోగస్తులు పాల్గొన్నారు

## లింగోటం గ్రామంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం

చౌటుప్పల్ జూన్ 21 వార్తా వేదిక సూర్య



యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ మండలం లింగోటం గ్రామంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం సర్వేజన సుఖినోభవంతు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం యోగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు పాలకూర పాండు మరియు అల్చం పాపయ్య గౌడు మరియు పాలకూర హరీష్ యోగా గురువు పాలకూర పాండు మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం వలన శారీరకంగా మానసికంగా ప్రశాంత చేకూరుతుందని అన్నారుమరియు యోగా సాధకులు ఉన్న వసంత గోదా గోవర్ధన్ జిల్లా బిక్షపతి సుజాత గంజి గణేష్ మిరియాల శారదమ్మ కృష్ణవేణి గ్రామ ప్రజలు వృద్ధులు ఎంతోమంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## బిఆర్ఎస్ తోనే సంక్షేమ పథకాలు సాధ్యం

### ఎమ్మెల్యే - తీగుళ్ళ పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, జూన్ 21(వార్త వేదిక సూర్య)

నిరుపేదలకు ప్రయోజనం కల్పించే కార్యక్రమాలను చేపట్టిన ఘనత బిఆర్ఎస్ తోనే పథకాలు సాధ్యం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సవ్యంగా కొనసాగించుకుండా ప్రజలను ఇబ్బంది పెడుతురాని మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం బౌద్ధనగర్ డివిజన్ కమ్యూనిటీ హాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన వెంటనే తమ ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు, బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫాలు, క్రిస్మస్ కానుకలు అందించమని తెలిపారు.

## రాష్ట్రంలో భూమి లేని పేదలందరికీ భూమి పంచాలి

### - వేముల మహేందర్ ఐదవ వర్ధంతి సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్ డిమాండ్

యాదాద్రి భువనగిరి జూన్ 21 వార్తా వేదిక సూర్య



వ్యవసాయ కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు అమరజీవి వేముల మహేందర్ అనేక భూమి పోరాటాలు వ్యవసాయ కూలి పోరాటాలు నిర్వహించారని వారి ఆశయ సాధన కోసం ప్రజలు భూమి పోరాటాల్లో కూలిపోరాటాల్లో కలిసి రావాలని రాష్ట్రంలో భూమిలేని పేదలందరికీ భూమి పంచాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్ డిమాండ్ చేశారు. ఆదివారం వేముల మహేందర్ ఐదవ వర్ధంతి కార్యక్రమాన్ని సిపిఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించి అనంతరం వారు మాట్లాడుతూ గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూమిని ఇస్తామని చెప్పి మోసం చేసిందని ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో రాష్ట్ర ప్రజలకు అనేక వాగ్దానాలు చేసి పాక్షిక పథకాలు మాత్రమే అమలు చేస్తుందని రాష్ట్రంలో ఉన్న పేదలందరికీ భూమి పంచాలి అని వారు డిమాండ్ చేశారు వీరితోపాటు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు కల్లూరి మల్లేశం జిల్లా కమిటి సభ్యులు గడ్డం వెంకటేష్ నాయకులు లావుడియా రాజు వల్దాసు అంజయ్య లక్ష్మయ్య వల్లబుదాసు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

### - ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కృషితోనే చౌటుప్పల్ కు అదనపు కోర్టు మంజూరు

### - చౌటుప్పల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నరసింహారెడ్డి

చౌటుప్పల్: జూన్ 21 వార్తా వేదిక సూర్య



మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కృషితోనే చౌటుప్పల్ కు అదనపు కోర్టు మంజూరు జరిగిందని చౌటుప్పల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నరసింహారెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చౌటుప్పల్ లో కేసుల సంఖ్య ఎక్కువగా ఉందని, చౌటుప్పల్ కు అదనపు కోర్టు అవసరం ఉ ందని, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అదనపు కోర్టు మంజూరు చేయాలని హైకోర్టుకు పలుమార్లు విన్నవించామన్నారు. దీంతో న్యాయవాదులు ఇచ్చిన విన్నపాలను పరిగణలోకి తీసుకున్న హైకోర్టు ఫిబ్రవరి,2025లో చౌటుప్పల్ లో అదనపు కోర్టు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించడం జరిగిందని తెలిపారు. దాదాపు సంవత్సరంన్నర నుంచి ఆర్థికపరమైన అనుమతుల కోసం పెండింగ్ లో ఉందని తెలిపారు. ఇట్టి విషయాన్ని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి, సంబంధిత మంత్రితో, రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఆర్థిక పరమైన అనుమతులను ఇప్పించారని గుర్తు చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చౌటుప్పల్ లో అదనపు జూనియర్ సివిల్ కోర్టును మంజూరు చేస్తూ జీవో నెంబర్ : 44ను శనివారం జారీ చేసిందన్నారు. గతంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చౌటుప్పల్ కోర్టును సందర్శించినప్పుడు చౌటుప్పల్ లో అదనకు కోర్టు, సబ్ కోర్టుల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. అదేవిధంగా సబ్ కోర్టు విషయంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చౌటుప్పల్ న్యాయవాదులను తన వెంట తీసుకొని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి మాట్లాడారన్నారు. చౌటుప్పల్ లో అదనపు కోర్టు ఏర్పాటు చేయించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అదనపు కోర్టు ఏర్పాటుతో కేసుల సత్వర పరిష్కారంతో పాటు కక్షిదారులకు, న్యాయవాదులకు మేలు జరుగుతుందన్నారు.

## మార్నింగ్ వాకింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలు



చౌటుప్పల్ జూన్ 21 వార్తా వేదిక సూర్య

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని వలిగొండ రోడ్ లో మార్నింగ్ వాకింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం జాతీయ యోగ డే నిర్వహించడం జరుగుతుంది అందులోనే భాగంగా ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు, యోగ గురువులు అసోసియేషన్ సభ్యులు చిన్నారులు అందరూ కలిసి యోగ ఆసనాలు వేశారు ఈ సందర్భంగా యోగా గురువులు పాండు మరియు పాపయ్య గారు మాట్లాడుతూ యోగాను కేవలం ఒక్క రోజుకే పరిమితం చేయకుండా, దానిని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని, భావి తరాలకు అందించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాసరెడ్డి అసోసియేషన్ మార్నింగ్ వాకింగ్ అధ్యక్షుడు వెల్తురి జంగయ్య. ఓంకార్. ఉపాధ్యక్షులు ఉష్కాగుల వెంకటేష్. శ్రీశైలం. మనీ. కాసర్ల సత్య వర్ధన్ రెడ్డి. బండి వెంకటరెడ్డి. జయంత్ అశ్విత్. చింతల ప్రభాకర్ రెడ్డి. మెట్టు రామచంద్ర రెడ్డి. కళ్లెం నాగరాజు . ఉప్పునూతల గణేష్ . జటంగి రాజు. రవి.ఉడుగు రమేష్. తూర్పునూరి సాయికుమార్. పోటు రవి. సిద్దు. బాలగోని మణి. చింతకింది గణేష్. జక్కర్తి శేఖర్. పొన్నాల సుల్తాన్. వెంకటేష్ చెరుకు చైతన్య. పొట్ట ప్రవీణ్ కుమార్. సిద్ధ గొని ఉపేందర్. పంతంగి అఖిల్. డబ్బేటి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు

## 150 బైక్‌లతో బీఆర్ఎస్ శక్తి ప్రదర్శన

### కేటీఆర్‌కు ఘన స్వాగతం

### -అక్కెం రాఘవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

### - అంబేద్కర్, వివేకానంద విగ్రహాలకు నివాళులు.. తొండుపల్లి టోల్‌గేట్ వద్ద కేటీఆర్‌కు స్వాగతం

రాజేంద్రనగర్, జూన్ 21 ( వార్త వేదిక సూర్య ) :



రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ శక్తిని చాటుతూ పార్టీ సీనియర్ నాయకుడు అక్కెం రాఘవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. దాదాపు 150 ద్విచక్ర వాహనాలతో నిర్వహించిన ఈ ర్యాలీ స్థానికంగా రాజకీయ ఉత్సాహాన్ని నింపింది ర్యాలీ ప్రారంభానికి ముందు బాంబే కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి, మధువన్ పద్మశాలిపురంలోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాటేదాన్, దుర్గానగర్, మైలార్‌దేవ్‌పల్లి మీదుగా శంషాబాద్‌లోని తొండుపల్లి టోల్‌గేట్ వరకు భారీ బైక్ ర్యాలీ చేపట్టి బీఆర్ఎస్ నాయకత్వానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డితో కలిసి తొండుపల్లి టోల్‌గేట్ వద్ద కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గుమ్మడి మైసిరెడ్డి, సురేష్ ముదిరాజ్, క్రాంతి యాదవ్, మధుసూదన్ చారి, అరుణ్ ముదిరాజ్, నరేష్ యాదవ్, శ్రీను, నాగరాజ్ తదితరులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు






## జగన్నాథ స్వామి ఆలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

### - కాటేదాన్‌లో ఆధ్యాత్మిక శోభ.. ప్రారంభమైన పూరి జగన్నాథ్ ఆలయం

రాజేంద్రనగర్, జూన్ 21 ( వార్త వేదిక సూర్య ) :

కాటేదాన్‌లో నూతనంగా నిర్మించిన పూరి జగన్నాథ్ మందిరాన్ని ఆదివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, యాత్రలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.మందిర ప్రారంభోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగాయి. ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తిరుమల వెంకటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ ప్రేమ్ దాస్ గౌడ్, మానస్ పాండే, సత్యానంద్ పాండే, దిలీప్ మహంతి, హరీష్, అభిమన్యు, భగవాన్ తాండ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణనగర్ కాలనీ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

### కాలనీ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కొత్త కమిటీ ఏర్పాటు

రాజేంద్రనగర్, జూన్ 21 ( వార్త వేదిక సూర్య )



శ్రీకృష్ణనగర్ కాలనీలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో పాత కార్యవర్గ కమిటీ పదవీకాలం ముగియడంతో నూతన కార్యవర్గాన్ని కాలనీ వాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధి, పరిశుభ్రత, భద్రత మరియు సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ కోసం కొత్త కమిటీ బాధ్యతలు చేపట్టనుంది.
నూతన కమిటీలో అధ్యక్షుడిగా మణిపాల్ రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా ఆదినారాయణ రెడ్డి, ధనుంజయ్, జనరల్ సెక్రటరీగా అమర్ సింగ్ నాయక్, వైస్ ప్రెసిడెంట్‌గా యాదగిరి, ట్రెజరర్‌గా రాఘవేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నరసింహారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్‌గా బాలకృష్ణ నాయక్ ఎన్నికయ్యారు. అలాగే పలువురు సభ్యులు కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, కాలనీ అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. ముఖ్యంగా విద్యుత్ వోల్టేజ్ సమస్య, ప్రధాన రహదారి మరమ్మతుల అవసరం వంటి అంశాలను సభ్యులు ప్రస్తావించారు.ఈ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన చర్యలు తీసుకునే దిశగా అడుగులు వేస్తామని నూతన కమిటీ హామీ ఇచ్చింది. ఐక్యతే బలం -- అభివృద్ధియే లక్ష్యం అనే నినాదంతో శ్రీకృష్ణనగర్‌ను ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

## రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం..

### కేటీఆర్ సమక్షంలో కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌లో చేరిక

రాజేంద్రనగర్, జూన్ 21 ( వార్త వేదిక సూర్య ) :



రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన అంశాలను కార్యకర్తలకు వివరించిన ఆయన, పార్టీ బలోపేతానికి సమన్వ యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.
సమావేశం అనంతరం హనుమాన్ నగర్‌ను సందర్శించిన కేటీఆర్ స్థానిక ప్రజలతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కార్తీక్ రెడ్డి, ఎస్ఐఆర్ ఇన్‌చార్జ్ శ్రీధర్‌తో కలిసి ప్రజల సమస్యలపై చర్చించి స్పందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు పి. శివముదిరాజు కేటీఆర్ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గతంలో రెండు సార్లు డివిజన్ అధ్యక్షుడిగా మరియు ఉద్యమ కారుడిగా పనిచేసిన ఆయన తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాం శమైంది. ఆయనతో పాటు అయాజ్ షరీఫ్, సతీష్ కూడా బీఆర్ఎస్‌లో చేరారు.కేటీఆర్ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానిస్తూ, రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




# రైతుకు యూరియా ఇవ్వలేని చేతగాని ప్రభుత్వం

**-యూరియా కోసం రైతులు క్యూల్లో..కాంగ్రెస్ ప్రభుత్వం నిద్రలో ఉంది.**

**-యాప్ పేరుతో యూరియాపై ఆంక్షలు.. రైతులపై కాంగ్రెస్ దౌర్జన్యం**

**-రైతు భరోసా లేదు..కరెంట్ లేదు..ఇప్పుడు యూరియా కూడా లేదు**

**-కేసీఆర్ హయాంలో ఎరువుల కొరత లేదు..కాంగ్రెస్ పాలనలో రైతుకు కష్టాలే..**

**-దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

దేవరకొండ జూన్ 21 (వార్త వేదిక సూర్య:-

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను సక్రమంగా అమలు చేయడం లేదు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను కూడా సరిగా సరఫరా చేయడం లేదు. ఇప్పుడు యూరియా విషయంలో కూడా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ మండిపడ్డారు. ఆదివారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.....రైతులకు రెండు బస్తాల యూరియానే ఇస్తామని, అదీ యాప్ ద్వా రా మాత్రమే అందిస్తామని కొత్త ఆంక్షలు విధించడంపై ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు.



గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యూరియా సరఫరాలో రవాణా సమస్యలు తలెత్తినప్పుడు, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు స్వయంగా సంబంధిత జీఎంలతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేవారని ఆయన గుర్తు చేశారు.ఆనాడు వ్యవసాయ శాఖ మంత్రి, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి తగిన చర్యలు తీసుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేవారు.బీఆర్ఎస్ పాలించిన తొమ్మిదిన్నరేళ్ల కాలంలో ఒక్క సీజన్‌లో కూడా యూరియా కోసం గానీ, ఇతర ఎరువుల కోసం గానీ రైతులు ఇబ్బంది పడలేదని పేర్కొన్నారు. ఎరువుల కోసం పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎప్పుడూ రాలేదు.

రైతులకు సకాలంలో ఎరువులు అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి 75 సార్లు వెళ్లారని చెబుతు న్నారని, అయితే రైతుల అవసరాల కోసం కేంద్రాన్ని ఎందుకు ఒప్పించ లేకపోతున్నారని ఆయన ప్రశ్నించారు.

రియల్ ఎస్టేట్ ప్రయోజనాలు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ వంటి అంశాల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి భూములు తెచ్చుకునే సామర్థ్యం ఉన్నప్పుడు, రైతులకు అవసరమైన యూరియాను ఎందుకు సాధించలేకపోతున్నారని నిలదీశారు.తెలంగాణ రైతులకు అవసరమైన యూరియాను వెంటనే అందించాలి.

గతంలో అమలైన విధంగానే యూరియా సరఫరా వ్యవస్థను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు



## ప్రొఫెసర్ జయశంకర్ 15వ వర్ధంతి ఘన నివాళి

దేవరకొండ జూన్ 21 (వార్త వేదిక సూర్య):-

దేవరకొండ పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ 15వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తొలి మలిదశ తెలంగాణ ఉద్యమాలలో తెలంగాణ రాష్ట్ర సాధన ముఖ్య ధ్యేయంగా సూచిస్తూ అన్ని రాజకీయ వేదికలతో సమన్వయం చేసి రాష్ట్ర సాధన కి కృషి చేసినటువంటి సిద్ధాంతి తెలంగాణ రాష్ట్రం వస్తే నీళ్లు, నిధులు నియామకాలు లతో తెలంగాణ సస్యశ్యామలంగా మారుతున్నది దోపిడీదారుల నుండి విముక్తి కలుగుతున్నది అని ఆలోచించి రాష్ట్ర సాధన ధ్యేయంగా పనిచేసినటువంటి నాయకుడు జయశంకర్ సార్ అని కొనియాడారు వారి ఆశయ సాధన కోసం యువత పనిచేయాలని కోరారు

ఈ కార్యక్రమంలో గరిడి విజయభాస్కర్, పున్న వెంకటేష్, ఎండి రంజాన్ బేగ్, అప్పం వీరయ్య, నట్వ సుధాకర్, మునగాల గణేష్, దోమకొండ హరి, జయప్రకాష్ నారాయణ, భూషరాజు నిరంజన్, గుండెబోయిన సురేష్, బొల్లెపల్లి శంకర్, కాటం వెంకటేష్ గౌడ్ చెరుకు నాగరాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు

## ముత్యాలమ్మ ఆలయం నిర్మాణానికి 30వేల అర్థిక సహాయం

దేవరకొండ జూన్ 21 (వార్త వేదిక సూర్య ):-



పి ఏ పల్లి మండలం వద్దిపట్ల గ్రామం లో నిర్మాణ దశ సగంలో ఉన్న శ్రీ శ్రీ ముత్యాలమ్మ ఆలయానికి నిర్మాణ పనులకు సహకరించాలి కోరగా తమ వంతు సహాయంగా 30,000 వేల రూపాయల అర్థిక సహాయం బీ .ఆర్.ఎస్ పార్టీ వద్దిపట్ల సర్పంచ్ శ్రీనయ్య గారి చేతుల మీదగా వారికి అందజేశారు

ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు వద్దిపట్ల సర్పంచ్ శ్రీనయ్య, మాజీ సర్పంచ్ వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ వెంకన్న, వార్డు సభ్యులు అనుష, అంజయ్య, గ్రామ పెద్దల జక్కలీ వెంకటయ్య, కషయ్య, బొడ్డుపల్లి వెంకటయ్య, నెల్లికంటి వెంకట్, ఉమ్మడి వద్దిపట్ల మాజీ సర్పంచ్ అమృ నాయక్, కనక చారి, దున్న గణేష్, దున్న కాశమ్మ ముత్తయ్య, బుడగ సుమలత, చెరుకుపల్లి దశరథ, సైదులు, మల్లేపల్లి కరుణాకర్, మల్లేపల్లి లక్ష్మమ్మ, శ్రీ రాములు, మాజీ నిర్వహణ కమిటీ చైర్మన్ చేపూరీ వెంకటయ్య, చంద్రయ్య, మండలీ అశోక్, అజ్మాపురం మాజీ సర్పంచ్ రామకృష్ణ, మల్లపురం మాజీ గ్రామ అధ్యక్షులు మురళి, పట్టం గండి జబ్బర్ లాల్. దేవరకొండ నియోజకవర్గ మాజీ ఉప సర్పంచ్ లా పోరం అధ్యక్షులు జవహర్ లాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

## పొఫెసర్ జయశంకర్ సార్ 15వ వర్ధంతి

దేవరకొండ జూన్ 21 ( వార్త వేదిక సూర్య):-

తెలంగాణ భావజాలని తెలంగాణ వ్యాప్తి కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయులు, తెలంగాణ స్ఫూర్తిప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ 15 వర్ధంతి సందర్భంగా ఈరోజు గుడిపల్లి గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వారిని స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూతం సైదులు, కొమ్ము నాగయ్య, భూతం శ్రీనివాస్, గంటల యాదయ్య, చిన్నపాక మహేష్, చిన్న పాక వెంకటమ్మ గ్రామపంచాయతీ సిబ్బంది ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు

## నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవంలో" ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

దేవరకొండ జూన్ 21 (వార్తా వేదిక సూర్య ):-

చందంపేట మండలం కోరుట్ల మాజీ సర్పంచ్ దొండేటి మల్లారెడ్డి అన్న దొండేటి వెంకట్ రెడ్డి -- రజిత దంపతుల కుమార్తెలు శ్రీజ, సిందూజా రెడ్డిల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్నారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు విద్యలో, సంస్కారంలో, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను కలుసుకుని వారికి శుభాభినందనలు తెలిపారు

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య అట్టహాసంగా జరిగింది.

# జనంలోకి కేటీఆర్, సబితమ్మ, కార్తీక్ రెడ్డి



**'బస్తీ బాట' విజయంతో నియోజకవర్గంలో వెల్లువెత్తిన సరికొత్త జోష్!**

**- హనుమాన్ నగర్‌లో మార్మోగిన 'గులాబీ' నినాదం**

**- రాజేంద్రనగర్‌లో మార్మోగిన గులాబీ నినాదం: బీఆర్ఎస్ లోకి భారీగా చేరికలు!**

రాజేంద్రనగర్, జూన్ 21 ( వార్త వేదిక సూర్య ) :

రాజేంద్రనగర్ నియోజకవర్గ రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది. హనుమాన్ నగర్ బస్తీ వేదికగా శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ "బస్తీ బాట" కార్యక్రమం స్థానిక సమీకరణాలను తిరగరాసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కార్తీక్ రెడ్డి సంయుక్తంగా బస్తీలో పర్యటించారు. గల్లీ గల్లీ తిరుగుతూ స్థానికులతో మమేకమై, పౌర సమస్యలను అడిగి తెలుసు కున్నారు. అగ్ర నాయకత్వం క్షేత్రస్థాయికి రావడంతో నియోజకవర్గ గులాబీ శ్రేణుల్లో మునుపెన్నడూ లేని సరికొత్త జోష్ వ్యక్తమవుతోంది. ఈ పర్యటన కేవలం సమస్యల పరిశీలనకే పరిమితం కాకుండా భారీ రాజకీయ మార్పునకు వేదికైంది. హనుమాన్ నగర్‌తో పాటు శివరాంపల్లి, గగన్‌పహాడ్ ప్రాంతాలకు చెందిన పలువురు కీలక సామాజిక, రాజకీయ నాయకులు, వందలాది మంది యువకులు, మహిళలు స్వచ్ఛందంగా తరలివచ్చి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరందరికీ నాయకులు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై నాయకులు చూపిన చొరవ, బస్తీ ప్రగతిపై ఇచ్చిన స్పష్టమైన హామీలకు ఆకర్షితులై తాము గులాబీ జెండా నీడకు వచ్చినట్లు చేరిన నేతలు ప్రకటించారు.

నియోజకవర్గంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమర్థవంతమైన నాయకత్వం, కార్తీక్ రెడ్డి నిరంతర క్షేత్రస్థాయి పర్యటనల వల్లే ప్రజల్లో బీఆర్ఎస్ పట్ల నమ్మకం రెట్టింపవుతోందని స్థానిక నేతలు స్పష్టం చేశారు. బస్తీ బాట పొడవునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలకగా, 'జై బీఆర్ఎస్.. జై కేసీఆర్' నినాదాలతో హనుమాన్ నగర్ వీధులు మార్మోగాయి. రాజేంద్రనగర్‌లో రోజురోజుకూ బీఆర్ఎస్ క్యాడర్ బలపడుతుండటం, దానికి తోడు ఈ తాజా భారీ చేరికలు స్థానిక రాజకీయ వర్గాల్లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. "బస్తీ బాట" కార్యక్రమం ఊహించని రీతిలో ఘనవిజయం సాధించడంతో రానున్న రోజుల్లో నియోజకవర్గంలో గులాబీ దళం తిరుగులేని శక్తిగా ఎదగడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరం



**మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు**

కూకట్ పల్లి, జూన్ 21 (వార్త వేదిక సూర్య):

శేరిలింగంపల్లి నియోజక వర్గం, వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ పటేల్ కుంట పార్కు దగ్గర మెడిస్లాష్ మెడికల్ ప్లాట్ ఫామ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించగా మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తమ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి సరైన సమయంలో వైద్య పరీక్షలు చేయించుకొని వైద్యుల సలహాల మేరకు సరైన మందులు వాడితే ఆనందకరమైన జీవితాన్ని గడపవచ్చు అని ఆయన తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, తదితర వైద్య పరీక్షలు చేశారు. నిర్వాహకుడు వినోద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. నేటి సమాజంలో ప్రైవేట్ హాస్పిటల్ వైద్యం ఖర్చుతో కూడుకున్నదని పేదలందరికీ ప్రైవేటు వైద్యం అందించాలనే సదుద్దేశంతో మేము మెడిస్లాష్ మెడికల్ ప్లాట్ ఫామ్ ను ఏర్పాటు చేశామని నీ ఫోన్లో ఈ యాప్ డౌన్లోడ్ చేసుకుంటే ఎమర్జెన్సీలో ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తామన్నారు. అలాగే ప్రతి ప్రవేట్ హాస్పిటల్ లో ప్రత్యేక రాయితీలు వర్తిస్తాయని అన్నారు. వైద్యుల సూచనల మేరకు తగిన మందులు వాడాలనీ పోషక విలువలున్న ఆహారం తీసుకొని, ప్రతి రోజు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మెడిస్లాష్ మెడికల్ ప్లాట్ ఫామ్ ఫౌండర్ శరత్చంద్ర , ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# టీటీడీ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం

**"యోగ-టీటీడీ ఆరోగ్యానంద" కార్యక్రమానికి విశేష స్పందన**

**14 రోజుల పాటు ప్రత్యేక యోగా శిక్షణ**

**ప్రముఖ యోగా గురువు ఆర్.కే. రాజు మార్గదర్శకత్వంలో, కళాశాల ప్రిన్సిపాల్ బానోత్ సురేందర్**

కూకట్ పల్లి, జూన్ 21 (వార్త వేదిక సూర్య) :

ప్రముఖ యోగా గురువు ఆర్.కే. రాజు మార్గదర్శకత్వంలో, కళాశాల ప్రిన్సిపాల్ బానోత్ సురేందర్ ఆధ్వర్యంలో; 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానములు (టీటీడీ) ఆధ్వర్యంలో నిర్వహించిన "యోగ-టీటీడీ ఆరోగ్యానంద" కార్యక్రమం ఘన విజయాన్ని సాధించింది. టీటీడీ ఛైర్మన్, ఈవో, జేఈవో మరియు డీఈవోల ఆదేశాల మేరకు జూన్ 7వ తేదీ నుండి జూన్ 21వ తేదీ వరకు ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి, యోగా దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా టీటీడీ నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర వేదాంతవర్ధినీ సంస్కృత కళాశాల మరియు పాఠశాలలో కూడా ప్రత్యేక యోగా శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక వికాసాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉద్యోగులు, స్థానిక భక్తులు మరియు ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రముఖ యోగా గురువు ఆర్.కే. రాజు మార్గదర్శకత్వంలో, కళాశాల



ప్రిన్సిపాల్ బానోత్ సురేందర్ ఆధ్వర్యంలో వరుసగా 14 రోజుల పాటు యోగా సాధన, ప్రాణాయామం, ధ్యాన కార్యక్రమాలు నిర్వహించారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం, శరీర-మనస్సుల సమతుల్యతను సాధించడం వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు మరియు స్థానిక ప్రజల్లో విశేష చైతన్యాన్ని తీసుకువచ్చింది. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారందరూ ప్రతిరోజూ యోగా సాధనను తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని సంకల్పించారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన "యోగ-టీటీడీ ఆరోగ్యానంద" కార్యక్రమం భక్తుల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు యోగా ప్రాముఖ్యతను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విజయవంతమైంది.



## కూకట్ పల్లి లో ఘనంగా ప్రపంచ యోగ దినోత్సవం

**యోగ ద్వారా ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ అలబడుతుంది**

**భారతీయ యోగా సంస్థాన శివసిద్ధి కుండలని సభ్యులు**

కూకట్ పల్లి, జూన్ 21 (వార్త వేదిక సూర్య) :

అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని కూకట్ పల్లి నియోజకవర్గ పరిధిలోని భారతీయ యోగా సంస్థాన శివసిద్ధి కుండలని సభ్యుల ఆధ్వర్యంలో బాలాజీ నగర్ హౌసింగ్ బోర్డ్ హౌ సింగ్ బోర్డ్ లో కాలనీ ఫ్రీడం పార్కులో యోగా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ నిత్యం యోగ ను పాటించడం వలన ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ అలవాటు అవుతుందని పేర్కొన్నారు. శ్వాసను నియంత్రించడం వలన శరీరంలోని ప్రతి అవయవాన్ని మన ఆధీనంలో ఉంచుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా నిత్యం మానసిక ఒత్తిడి, వృత్తిపరమైన ఒత్తిడి నుండి ఉపశమనం కలగడానికి యోగ గొప్ప ఔషధమని అభిప్రాయం వ్యక్తం చేశారు. నిత్యం యోగ ను అభ్యసించడం వలన మానసిక ఉల్లాసప పాటు, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు.

## యోగ అలవాటు చేసుకుంటే ఆరోగ్యమే కాదు ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుంది : కొత్త సోల్కర్ రెడ్డి


రాజేంద్రనగర్, జూన్ 21 ( వార్త వేదిక సూర్య ) :




ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రేమావతిపేట ప్రాథమిక పాఠశాలలో ఆదివారం యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు కొత్త సోల్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై యోగా గురువును శాలువాతో సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా కొత్త సోల్కర్ రెడ్డి మాట్లాడుతూ, యోగా మన శారీరక, మానసిక ఆరోగ్యాలను మెరుగుపరచే గొప్ప భారతీయ సంప్రదాయమని, ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో సురేందర్ రెడ్డి, మల్లేష్ యాదవ్, రాజశేఖర్ రెడ్డి, రాజు రెడ్డి, హరికిషన్, సందీప్ తదితరులు పాల్గొని యోగా ప్రాధాన్యతను వివరించారు.

## ఓటు హక్కు ప్రతి ఒక్కరూ వినయోగించుకోవాలి

సికింద్రాబాద్, జూన్ 21(వార్త వేదిక సూర్య)



ఓటు హక్కు ప్రతి ఒక్కరూ వినయోగించుకోవాలని బిఆర్ఎస్ పార్టీ మహిళ సీనియర్ నాయకురాలు మురారి స్మితా కోటేష్ గౌడ్ అన్నారు. ఆదివారం తార్నాక డివిజన్ స్ట్రీట్ నెంబర్ 12, 13 పలు ప్రాంతాల్లో పర్యటించి ఇంటి ఇంటికి తిరుగుతూ ఎస్ఐఆర్ కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయించుకోవడం కొత్త ఓటర్లను నమోదు చేయించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సోమవారం
జూన్ 22, 2026
సంపుటి : 2 సంచిక : 33
Follow:



# అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ - కొంతం దీపిక నరేష్

సికింద్రాబాద్, జూన్ 21(వార్త వేదిక సూర్య)

ఈస్ట్ మారేడ్పల్లి పద్మశాలి సంఘం మండపంలో ఆదివారం పద్మశాలి సేవా సమాజం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మోండా మార్కెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ఒత్తిడిని దూరం చేసి, శరీరాన్ని దృఢంగా ఉంచే ఒక అద్భుతమైన సాధనం.. యోగా అదేవిధంగా యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు, అది మన మనసును, శరీరాన్ని ప్రకృతితో అనుసంధానించే ఒక జీవన విధానం. ఈ ప్రత్యేకమైన రోజున మీ స్నేహితులు, ఆప్తులు అందరికీ ఆరోగ్యకరమైన సందేశాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సమాజం ట్రస్ట్ చైర్మన్ నోముల ప్రకాష్, జనరల్ సెక్రెటరీ గుత్తికొండ రమేష్, శ్లోకం యోగా ఫౌండర్ వినోద్, పద్మశాలి మహిళ అభ్యుదయ సంఘం ప్రెసిడెంట్ గంజి రజిని, నోముల రజిని, సునిత తదితరులు పాల్గొన్నారు.

# NEET (UG)-2026 పరీక్షా కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్

## పరీక్షా కేంద్రాల వద్ద BNSS సెక్షన్ 163 అమలు -- ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహణకు పటిష్ట భద్రత

నల్గొండ టౌన్ జూన్ 21 వార్త వేదిక సూర్య




జిల్లాలో నిర్వహిస్తున్న చీజుజు (ఖ+)-2026 రీ-ఎగ్జామినేషన్ సందర్భంగా నల్గొండ పట్టణంలోని ఎన్.జీ. కళాశాల పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ పరిశీలించారు. పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు, అభ్యర్థుల ప్రవేశ ప్రక్రియలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో భారతీయ నాగరిక సురక్షా సంహిత (దీచీూ) సెక్షన్ 163 అమల్లో ఉన్నందున ఎవరూ గుంపులుగా నిలబడకూడదని పరీక్షా కేంద్రాల వద్ద అనవసర రద్దీ సృష్టించవద్దని సూచించారు
పరీక్షల నిర్వహణలో పాల్గొంటున్న పోలీసు అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, పరీక్షా పత్రాలు కేంద్రాల నుంచి స్ట్రాంగ్‌రూమ్‌కు భద్రంగా చేరే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. పరీక్షల పారదర్శకత, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు
అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాస్తున్నారని, జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. పరీక్షల విజయవంతమైన నిర్వహణకు అభ్యర్థులు తల్లిదండ్రులు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# 12 వ బెటాలియన్ అన్నెపర్తిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహణ

నల్లగొండ బ్యూరో, జూన్ 21 (వార్తా వేదిక సూర్య )

నల్గొండ జిల్లా అన్నెపర్తి లోని 12 వ బెటాలియన్ ప్రాంగణంలో కమాండెంట్ కె. వీరయ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ కె. వీరయ్య మాట్లాడుతూ.. యోగా మన నిత్య జీవితంలో అత్యంత ముఖ్యమైన భాగం, ప్రతి రోజు యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ద ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ కు చెందిన శ్రీ జె. బాలకృష్ణ, నాగరాజు పాల్గొని యోగా సాధన ప్రాముఖ్యతను వివరించి, పలు యోగాసనాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు నర్సింగ్ వెంకన్న, కె. మహేందర్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా సాధన చేశారు.

# తాతయ్య--నానమ్మ జ్ఞాపకార్థం

## విద్యార్థులకు స్వచ్ఛజల కానుక..
## విజ్ఞాన వెలుగుల కోసం అశోక్‌రెడ్డి దంపతుల సేవ
## స్వచ్ఛజలంతో ఆరోగ్యం.. విజ్ఞానంతో భవిష్యత్తు
## తిమ్మాపురం బడికి అశోక్‌రెడ్డి దంపతుల అమూల్య కానుక



దేవరకొండ జూన్ 21 (వార్త వేదిక సూర్య):-

పెద్దల జ్ఞాపకాలను పదిలపరుస్తూ, విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడే సత్కార్యానికి నేరేడుగోమ్మ మండలం తిమ్మాపురం గ్రామం వేదికైంది. కీర్తిశేషులు ఇప్ప వెంకటరెడ్డి -- భగీరథమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి మనవడు ఇప్ప అశోక్‌రెడ్డి, రేణుక దంపతులు తిమ్మాపురం ప్రభుత్వ పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యాన్ని అందించారు.
ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రవికుమార్ మాట్లాడుతూ తిమ్మాపురం గ్రామ ప్రజలు విద్యాభివృద్ధిలో ఎల్లప్పుడూ ముందుంటారని ప్రశంసించారు. పాఠశాల అభివృద్ధికి గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, దాతలు కలిసి కృషి చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన అశోక్‌రెడ్డి, రేణుక దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.
వాటర్ ప్లాంట్ దాత ఇప్ప అశోక్‌రెడ్డి మాట్లాడుతూ తమ తాతయ్య ఇప్ప వెంకటరెడ్డి, నానమ్మ భగీరథమ్మ జ్ఞాపకార్థం ఈ సేవా కార్యక్రమం చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. తల్లిదండ్రులు, గురువులు, పెద్దలు అందించిన విలువలను సమాజానికి తిరిగి అందించడమే నిజమైన కృతజ్ఞత అని పేర్కొన్నారు.
విద్యార్థులు చదువుల్లో రాణించి అజ్ఞానాన్ని వీడి విజ్ఞాన మార్గంలో పయనించాలని ఆయన ఆకాంక్షించారు. విజ్ఞానం అంటే పుస్తక జ్ఞానం మాత్రమే కాదని, మంచి ఆలోచనలు, మానవీయ విలువలు, సమాజానికి ఉపయోగపడే అవగాహన, బాధ్యతతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవడమే నిజమైన విజ్ఞానమని అన్నారు. విద్యతో పాటు విలువలు పెంపొందితేనే ఆదర్శవంతమైన పౌరులు తయారవుతారని పేర్కొన్నారు.
మనబడి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పాఠశాలలు అభివృద్ధి చెందితే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు.
ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి, రేణుక దంపతులు విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల తమకున్న శ్రద్ధను చాటుతూ స్వచ్ఛమైన నీటితో పాటు పోషకాహారం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ చదువుల్లో మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.
ముఖ్య అతిథి నేరేడుగొమ్ము ఎంఈఓ బ్రహ్మాచారి మాట్లాడుతూ ఆహారం ఎంత ముఖ్యమో స్వచ్ఛమైన తాగునీరు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ఈ వాటర్ ప్లాంట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.
కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వాతిముత్యం, వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొని అశోక్‌రెడ్డి దంపతులను అభినందించారు. వారి సేవా కార్యక్రమం గ్రామంలో ఆదర్శంగా నిలుస్తుందని పలువురు ప్రశంసించారు

# మిర్యాలగూడ త్రిపుల్ మర్డర్ కేసును ఛేదించిన నల్గొండ జిల్లా పోలీసులు

## సాంకేతిక ఆధారాలతో నిందితుడి అరెస్ట్
## జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్

నల్గొండ టౌన్ జూన్ 21 వార్త వేదిక సూర్య




మిర్యాలగూడ పట్టణంలోని కలాల్‌వాడలో ఈ నెల 4వ తేదీన జరిగిన అగ్నిప్రమాద ఘటనలో ముగ్గురు సజీవదహనమై మృతి చెందిన కేసును నల్గొండ జిల్లా పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. తొలుత ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంగా భావించిన ఈ ఘటన వెనుక పథకం ప్రకారం జరిగిన హత్య ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది.
జిల్లా ఎస్పీ శ్రీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీసీఆర్‌బీ డీఎస్పీ జి. రవి పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఏర్పడి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు
దర్యాప్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం, ఊళ్ళ పాలెం గ్రామానికి చెందిన కాళహస్తి శిరీష్ కుమార్ (38) ఈ ఘాతుకానికి పాల్పడినట్లు నిర్ధారణ అయింది. నిందితుడు గతంలోనే వివిధ ప్రాంతాల్లో దొంగతనాలు, మోసాలకు పాల్పడిన చరిత్ర కలిగి ఉన్నట్లు విచారణలో తేలింది
తెలుగు మ్యాట్రిమోనీ వంటి వివాహ వెబ్‌సైట్ల ద్వారా మహిళలతో పరిచయాలు పెంచుకుని, వారి నమ్మకాన్ని సంపాదించి వివాహం చేసుకోవడం లేదా వివాహం చేసుకుంటానని నమ్మించి ఆర్థిక ప్రయోజనాలు పొందడం నిందితుడి అలవాటుగా మారినట్లు పోలీసులు గుర్తించారు. ఇదే విధంగా బాధితురాలు ధనలక్ష్మితో కూడా పరిచయం ఏర్పరుచుకుని వివాహం చేసుకున్నాడు
కాలక్రమేణా ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ధనలక్ష్మి అతడిని దూరం పెట్టింది. హాజీపూర్‌లో ఒక మహిళను మోసం చేసిన కేసులో జైలులో ఉన్న సమయంలో తనకు ఎలాంటి సహాయం చేయకపోవడం, బెయిల్ కోసం ప్రయత్నించకపోవడం పట్ల నిందితుడు తీవ్ర ఆగ్రహం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ధనలక్ష్మి మరియు ఆమె పిల్లలను హత్య చేయాలని ముందుగానే నిర్ణయించుకున్నాడు
తన ప్రణాళికలో భాగంగా నేరానికి కొన్ని రోజుల ముందే పరిస్థితులను పరిశీలించాడు. సంఘటన జరిగిన రోజు ఉదయం తన ఇంటి సమీపంలో ఉన్న యాక్టివా స్కూటీని దొంగిలించి మిర్యాలగూడ వైపు బయలుదేరాడు. మార్గమధ్యలో ఒక ప్లాస్టిక్ క్యాన్ కొనుగోలు చేసి పెట్రోల్ బంకులో పెట్రోల్ నింపించుకున్నాడు. అనంతరం పలు ప్రాంతాల్లో తిరుగుతూ రాత్రి వరకు సమయం గడిపి అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డాడు
రాత్రి సమయంలో బాధితుల ఇంటి పరిసరాలను గమనించి అందరూ నిద్రలో ఉన్నారని నిర్ధారించుకున్న తర్వాత ఇంట్లోకి ప్రవేశించాడు. అక్కడ ఉన్న ప్లాస్టిక్ బకెట్‌లో పెట్రోల్ పోసి నిద్రిస్తున్న వారిపై చల్లాడు. అనంతరం అగ్గిపుల్ల గీసి మంటలు అంటించి సంఘటనను ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలా కనిపించేలా ప్రయత్నించాడు. ఈ క్రమంలో మంటలు నిందితుడికి కూడా అంటుకున్నప్పటికీ అక్కడి నుంచి తప్పించుకుని పరారయ్యాడు
బాధితురాలు ధనలక్ష్మి సంఘటన జరిగిన రోజు ఇంట్లో లేకపోవడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. అయితే ఇంట్లో నిద్రిస్తున్న ఆమె తల్లి వనం చంద్రమ్మ (48), కుమారుడు లక్ష్మణ్ (17), కుమార్తె ప్రణతి (15) మంటల్లో చిక్కుకుని సజీవదహనమై మృతి చెందారు.
సంఘటన స్థలంలో లభించిన సూక్ష్మ ఆధారాలు కాలిపోయిన ఇంటి వెనుక భాగంలో లభించిన పెట్రోల్ వాసన ఉన్న బకెట్ వివిధ ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలు, ప్రయాణ మార్గానికి సంబంధించిన సమాచారం సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన పోలీసులు నిందితుడి కదలికలను గుర్తించి అరెస్టు చేశారు
నిందితుడి వద్ద నుంచి స్కూటీ, పెట్రోల్ క్యాన్, బకెట్, పాక్షికంగా కాలిపోయిన షర్ట్, హెల్మెట్, సెల్‌ఫోన్, ఘటనాస్థలంలో వదిలివెళ్లిన చెప్పులను స్వాధీనం చేసుకున్నారు
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ వివాహ సంబంధాల కోసం ఉపయోగించే ఆన్‌లైన్ వేదికల ద్వారా పరిచయమయ్యే వ్యక్తుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు పూర్తిస్థాయి వివరాలు నేపథ్యాన్ని నిర్ధారించుకున్న తర్వాతే సంబంధాలు ఏర్పరచుకోవాలని ఆయన పేర్కొన్నారు
ఈ క్లిష్టమైన కేసును అత్యంత వేగంగా ఛేదించిన డీసీఆర్‌బీ డీఎస్పీ జి. రవి, మిర్యాలగూడ × టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం. నాగభూషణరావు, ప్రొబేషనరీ ఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్‌లు జి. రాజారాం, నల్లగంతుల శ్రీను, ఎస్. వెంకటేశ్వర్లు, హుస్సేన్, బి. వీరబాబు, జి. నర్సింహా, బి. ప్రసాద్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందిస్తూ ప్రశంసాపత్రాలు మరియు నగదు రివార్డులను ప్రకటించారు.

# అయిటిపాముల లిఫ్ట్ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి

## ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం
## ప్రాజెక్టుపై అధికారులతో సమీక్ష:
## రైతులకు త్వరగా సాగునీరు అందించాలని ఆదేశం



నల్గొండ టౌన్ జూన్ 21 వార్త వేదిక సూర్య

నకిరేకల్ పట్టణంలోని పన్నాలగూడెం క్యాంప్ కార్యాలయంలో కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష ఈ సందర్భంగా ప్రాజెక్టు పనుల పురోగతి, సాగునీటి అందుబాటు, రైతులకు కలిగే ప్రయోజనాలు మరియు పెండింగ్‌లో ఉన్న పనులపై అధికారులతో విస్తృతంగా చర్చించారు ప్రాజెక్టు పనులను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు త్వరితగతిన సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమే ప్రభుత్వ ధ్యేయం అయిటిపాముల లిఫ్ట్ పూర్తయితే కట్టంగూర్ మండలంలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని, దీంతో రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఎమ్మెల్యే తెలిపారు పెండింగ్ పనులకు ఎలాంటి నిధుల కొరత ఉండదని, నాణ్యతతో కూడిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.






# నూతన పట్టు వస్త్ర అలంకరణలో పాల్గొని ఆశీర్వదించిన టిపిసిసి ఎస్సి డిపార్ట్మెంట్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ యేకుల రాజారావు

దేవరకొండ జూన్ 21 (వార్త వేదిక సూర్య ):-

దేవరకొండ పట్టణంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్ లో ఆదివారం గుండ్లపల్లి మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన గోరటి రమణ-శ్రీను దంపతుల కుమార్తె హాసిని మరియు కుమారుడు లక్కీ ల నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుకకు హాజరై మెమొంటోను అందజేసి చిన్నారులను ఆశీర్వదించిన టిపిసిసి ఎస్సి డిపార్ట్మెంట్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ యేకుల రాజారావు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను కలుసుకుని శుభాకాంక్షలు తెలియ జేశారు. హాసిని మరియు లక్కీలు ఉన్నత విద్యను అభ్యసించి, సంస్కారంతో , జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బోయిని చంద్రమౌళి, తిమ్మాపురం సర్పంచి స్వాతి ముత్యం, మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గం గోరటి అంజి, పంబాల పర్వతాలు, మాల మహానాడు సోషల్ మీడియా కోఆర్డినేటర్ చేపూరి మురళి, బయ్య శ్రీను, బయ్య శేఖర్, తిరుపతి, స్థానిక ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# నల్లగొండ పాతబస్తీ గౌడ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహణ

నల్లగొండ బ్యూరో, జూన్ 21 (వార్తా వేదిక సూర్య )

నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం మరియు నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ల సన్మాన కార్యక్రమం గౌడ సంఘ భవనం వద్ద ఘనంగా నిర్వహించబడింది.గౌడ పెద్దలు బైరగోని రాజయ్య గౌడ్ మాట్లాడుతూ ప్రతి వార్డులో గౌడ సంఘ కమిటీలను ఏర్పాటు చేసి గౌడ ఐక్యతను మరింత బలోపేతం చేయాలని, సామాజిక సేవా కార్యక్రమాల్లో అందరూ ముందుండాలని పిలుపునిచ్చారు. గౌడ పెద్దలు తండు సైదులు గౌడ్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారి విగ్రహాన్ని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దివంగత కందుల యాదగిరి గౌడ్ స్మారకార్థం వారి సతీమణి కందుల నిర్మలమ్మ గౌడ్, కుమారులు బాలరాజు గౌడ్, రమణ గౌడ్‌లు గౌడ సంఘ భవన నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ కార్పొరేటర్లు రేగట్టే అండాలు లింగస్వామి గౌడ్, గోపగోని స్వాతి రాజశేఖర్ గౌడ్, పాలకూరి సుమలత సంతోష్ గౌడ్‌లతో పాటు స్థానిక కార్పొరేటర్ గుండబోయిన పుష్పలత వెంకన్న యాదవ్, అక్కనపల్లి రేవతి, బలరాం, మామిడి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ పెద్దలు పుల్లెంల యాదగిరి గౌడ్ సురిగి వెంకన్న గౌడ్ హాజరై నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. నూతన కమిటీలో అధ్యక్షుడిగా పెద్దగోని సురేష్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా బోయపల్లి వెంకటేశ్వర్లు గౌడ్‌తో పాటు పుల్లెంల రాము గౌడ్, చెన్నగోని లింగస్వామి గౌడ్, బోయపల్లి మధు గౌడ్, కొమ్మగోని సతీష్ గౌడ్, ఐతగోని రమేష్ గౌడ్, వాయుల నాగరాజు గౌడ్, అనంతల యాదగిరి గౌడ్, ఐతగోని గణేష్ గౌడ్ తదితరులు బాధ్యతలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో యువకులు, గౌడ సంఘ సభ్యులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# యోగతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యం

## ప్రతి ఒక్కరూ యోగా వ్యాయామం, ఫిట్నెస్ కు ప్రాధాన్యత ఇవ్వాలి
## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపు

నల్లగొండ బ్యూరో, జూన్ 21 (వార్తా వేదిక సూర్య )

యోగాను ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప దేశం భారతదేశమని, నేడు ప్రపంచవ్యాప్తంగా యోగా ప్రాముఖ్యతను గుర్తించి అనుసరిస్తున్నారని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పతంజలి సంస్థ, ఆయుష్ శాఖ, జిల్లా క్రీడాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన యోగా దినోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై యోగాసనాలు వేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజూ 15 నుంచి 20 నిమిషాల పాటు యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. తాను చదువుకునే రోజుల్లో పెద్దలు "డబ్బు కంటే ఆరోగ్యమే మహాభాగ్యం" అని చెప్పేవారని గుర్తుచేస్తూ, నేటి విద్యార్థులు ప్రతిరోజూ ఆటలతో పాటు, యోగా అలవాటు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పతంజలి సంస్థ ప్రతినిధి కర్నాటి విజయకుమార్ మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో యోగా గురువులను, సేవలందించిన పలువురిని జిల్లా కలెక్టర్ సన్మానించారు.అనంతరం అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పి రమేష్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హాఫీజ్ ఖాన్, వైద్యాధికారి రాహుల్ , జిల్లాక్రీడల అధికారి అక్బర్ అలీ,నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్ర, పతంజలి సంస్థ శ్యాంసుందర్,ఆయుష్ శాఖ సుభాషిని, స్థానిక కార్పొరేటర్ సుభాష్, క్రీడాశాఖ అధికారులు, ప్రతినిధులు, యోగా గురువులు, విద్యార్థులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# తుర్కపల్లిలో ప్రభుత్వ విప్ ఐలయ్య సుడిగాలి పర్యటన

- రూ.లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు..
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టుబట్టలు, యాట పొట్టేళ్ల పంపిణీ

**యాదాద్రి భువనగిరి జిల్లా /వార్తావేదిక సూర్య:-** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో ఆదివారం ఆయన సుడిగాలి పర్యటన చేస్తూ పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### మహిళా సంఘాల భవనాలకు శంకుస్థాపనలు

మండలంలోని రుస్తాపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ సంతోష్ రెడ్డితో కలిసి మహిళా సంఘ భవన నిర్మాణానికి విప్ బీర్ల ఐలయ్య శంకుస్థాపన చేశారు. అనంతరం మండలం లోని బీల్యా నాయక్ తండా, మాదాపురం, రాంపురం, తిరుమలపురం గ్రామాల్లో మహిళా సంఘాల అభివృద్ధికి తోడ్పడే విధంగా నూతన మహిళా సంఘం భవనాల నిర్మాణాలకు శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల సామాజిక సాధికారతకు మహిళా సంఘాలు కీలకమని, వారి కార్యకలాపాలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ భవనాల నిర్మాణం పూర్తయితే గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు.

### ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టుబట్టలు, యాట పొట్టేళ్ల పంపిణీ

మండలంలోని ముల్కపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారికి పట్టు బట్టలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాకుండా, ఆయా కుటుంబాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ పల్లెటూరి సాంప్రదాయం ప్రకారం లబ్ధిదారులకు యాట పొట్టేళ్లను అందజేసి ఆశీర్వదించారు.

### పేదల సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమమే పరమావధిగా దూసుకుపోతోం దన్నా రు. నిరు పేదల సొంత ఇంటి కలను సాకారం చేయాలనే దృఢ సంకల్పంతోనే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక ంగా అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి పేద కుటుం బానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.



పెద్ద సంఖ్యలో హాజరైన జనం

ఈ మండల స్థాయి పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు మరియు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# రైతుబంధు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం కుట్ర

**మోత్కూరు, జూన్ 21 ( వార్త వేదిక సూర్య ):** రైతులకు వానాకాలం రైతు బంధు ఇవ్వకుండా మరోసారి మోసం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కొణతం యాకుబ్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ రైతుబంధు ఆపడానికే రాష్ట్రంలో ఎక్కడో చోట ముఖ్యమంత్రి సభలు సమావేశంలో పెట్టి విడుదల చేస్తున్నట్లు ప్రకటన జారీ చేస్తున్నారే తప్ప ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని విమర్శించారు. రాజన్న గూడెం రోడ్డు విషయంలో ఎమ్మెల్యే ఎందుకు మౌనంగా ఉంటున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# వేముల మహేందర్ ఆశయాలను సాధిద్దాం

**వలిగొండ: జూన్ 21 ( వార్తా వేదిక సూర్య ) :** సిపిఎం మాజీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వలి గొండ మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు వేముల మహేందర్ ఆశయాలను సాధిద్దామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజ య్య పిలుపుని చ్చారు. ఆదివారం రోజున మండల కేంద్రంలో వేముల మహేందర్ 5వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు పూల మాల వేసి నివాళ్ళర్పించిన అనంతరం సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య మాట్లాడుతూ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా వలిగొండ మండల పరిషత్ ఉపాధ్యక్షులుగా పనిచేసి వలిగొండ మండలం లో అనేక ప్రజా ఉద్యమాలలో ముందు బాగాన నిలిచిన వేముల మహేందర్ ను కోల్పోవడం సిపిఎం ప్రజా ఉద్యమాలకు అదే విధంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులుగా కెవిపిఎస్ ఉమ్మడి నల్గొండ జిల్లా కార్యదర్శిగా అనేక దళిత మరియు కూలీల సమస్యలపై ప్రజా సమస్యలపై పోరాడిన వేముల మహేందర్ ను కోల్పోవడం ఆ వర్గాల ప్రజలకు తీరని నష్టమని వారి ఆశయ సాధనకు కృషి చేద్దామని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గణపతి రెడ్డి,మండల కార్యదర్శివర్గ కూర శ్రీనివాస్, తుర్కపల్లి సురేందర్, వాకిటి వెంకటరెడ్డి, మండల కమిటీ సభ్యులు దుబ్బ లింగం, నాయకులు నానాచర్ల రమేష్, కొండూరు సత్తయ్య శీలం ఇందిర, మారబో యిన నరసింహ,వేముల నాగరాజు, వరికుప్పల యాదయ్య, వేముల లక్ష్మయ్య, పాలకుంట్ల నరసింహ, దొడ్డి యాదగిరి,ఈర్ల రమేష్, ఇస్తారి, స్వామి తదితరులు పాల్గొన్నారు.



# "విద్యా, విజ్ఞానం ద్వారానే సామాజిక మార్పు సాధ్యం"

- నాలెడ్జ్ సెంటర్ కి పుస్తకాలను అందజేసిన బీర్ల ఫౌండేషన్
- బీర్ల అయిలయ్య ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్
- "యువత ఉన్నత భవిష్యత్తు కోసం నాలెడ్జ్ సెంటర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి"
- ఇటిక్యాల పురుషోత్తం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్

**యాదాద్రి భువనగిరి జిల్లా /వార్తా వేదిక సూర్య:-** విద్యా మరియు విజ్ఞానం ద్వారా నేటి సమాజంలో సామాజిక మార్పు తీసుకురావడం కోసం అందరం కలిసి కృషి చేయాలని ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు.పూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ రెండవ వార్షికోత్సవం సందర్భంగా ఈరోజు జిల్లా కేంద్రంలో జరిగిన సభకి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విజ్ఞానాన్ని విస్తరించేందుకు మహనీయులు గౌతమ బుద్ధుడు,మహాత్మా జ్యోతిరావు పూలే, బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తున్న నాలెడ్జ్ సెంటర్ కృషి అభినందనీయమని అన్నారు. విద్యా ద్వారా విజ్ఞానం పెంచి అసమానతలకు వ్యతిరేకంగా పోరాడిన జ్యోతిరావు పూలే , అంబేద్కర్ ల ఆశయాలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు యువతకు ఈ నాలెడ్జ్ సెంటర్ ఎంతో ఉపయోగపడు తుందని, విద్యార్థులు. యువత పూలే అంబేద్కర్ నాలెడ్జ్ నీ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ సందర్భంగా బీర్ల ఫౌండేషన్ సౌజన్యంతో ఇరవై అయిదు వేల రూపాయల విలువ చేసే స్టడీ మెటీరియల్ అందజేశారు.రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం మాట్లాడుతూ నేటి యువత ఉన్నత విద్యను అభ్యసించాలని ఇందుకోసం తగిన ప్రణాళికతో ముందుకెళ్లాల ని, మహనీయుల సిద్ధాంతాలు, ఆశయాలు వారు సమాజంలో మార్పుల కోసం చేసిన కృషిని విస్తృత పరిచేందుకు భువనగిరిలో నిర్వహిస్తున్న నాలెడ్జ్ సెంటర్ నిర్వాహకుల తపన అభిందనీయమని అన్నారు.మూఢ విశ్వాసాలకు దూరంగా, మానవ విలువలను బలోపేతం చేసే విధంగా నేటి యువత ప్రయాణం ఉండాలని అన్నారు.తన భవిష్యత్ ను ఉన్నతంగా మలుచుకునేందుకు ఇష్టంగా చదవాలని, గమ్యం లేని ప్రయాణం మాదిరిగా ఉండకూడదని అన్నారు.దేశంలో విద్యా వ్యాప్తికి మెదటగా పూలే, సావిత్రి బాయి పూలే చేసిన మహా ఉద్యమం కొనసాగింపుగా ఇలాంటి నాలెడ్జ్ సెంటర్ లు నడవాలని ఇందులో యువత భాగస్వామ్యం అయి సామాజిక మార్పు దిశగా అడుగులు వేయాలని అన్నారు.దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్, అధ్యాపకులు రాజారాం నాయక్, మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, దళిత ఐక్య వేదిక అధ్యక్షులు బట్టు రామచంద్రయ్య, కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్, విశ్రాంత ఏంఈవో బండారు రవివర్ధన్, బర్రె సుదర్శన్, ఏశాల అశోక్, డిటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్ భాస్కర్ లు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ రాజ్యాంగ విశిష్టతపై చైతన్యం చేస్తూ ముందుకెళ్తున్న పూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ భవిష్యత్తులో మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు.ఈ వేడుకకు నాలెడ్జ్ సెంటర్ నిర్వాహకులు భానోతు భాస్కర్ నాయక్, సురుపంగ శివలింగం లు సమన్వయం చేయగా కుతాడి సురేష్, నాగారం శంకర్, జెన్నీ వెన్నెల, దొడ్డి యాదగిరి, స్వరూప, బొట్ల రమేష్, ఇంజ మహేశ్, యాకుబ్, నర్సింహ నాయక్, భారత్, మంగ్త నాయక్, దాసరి లక్ష్మయ్య, కవిత, చంద్రకళ, శోభారాణి, అనూష తదితరులు పాల్గొన్నారు.



# టీ పి ఎస్ యూ కరపత్రం ఆవిష్కరణ

- పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి



**యాదగిరిగుట్ట జూన్ 21 (వార్త వేదిక సూర్య) :** తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘము(టీ పి ఎస్ యూ) ఆధ్వర్యంలో తేదీ 26-06-2026 శుక్రవారం రోజున ఉదయం 9:30 గంటలకు స్వకుల సాలి సమాజ భవనం ఎల్బీనగర్ హైదరాబాద్ లో జరగబోయే తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆవిష్కరించడమైనది. ఈ యొక్క సదస్సుకు జిల్లా పద్మశాలి ఉద్యోగులందరూ హాజరై, రాష్ట్ర స్థాయిలో పద్మశాలి ఉద్యోగుల సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలొ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు, పెండెం శ్రీనివాస్ నేత, ప్రధాన కార్యదర్శి రచ్చ గణేష్ ప్రసాద్ నేత, సెక్రటరీ గంజి నాగేశ్వర్ రావు నేత, కార్యవర్గం సభ్యులు మీన సురేందర్ నేత, రాపోలు సోమేశ్వర్ నేత, స్వర్గం జనార్దన్ నేత తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించాలి

### ఏఐఎస్ఎఫ్



**మోత్కూరు, జూన్ 21 ( వార్తా వేదిక సూర్య):** ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ( ఏఐఎస్ఎఫ్) జిల్లా నాయకులు జిట్ట గౌతమ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు నిబంధనలను విరుద్ధంగా ఫీజులను పెంచుతూ పేద మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులు గురి చేస్తున్నారని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని విధాలుగా మౌళిక సదుపాయాలు కల్పించడంతోపాటు విద్యను అందించినట్లయితే ప్రభుత్వ పాఠశాలలో బలోపాతం కానున్నాయని పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను అర్హులకే కేటాయించాలి



**మోత్కూరు, జూన్ 21 ( వార్త వేదిక సూర్య ):** మోత్కూరు మున్సిపల్ పరిధితో పాటు మండలంలో అన్ని గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇంద్రమ్మ ఇండ్లను అర్హులకు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని మాదిగ హక్కుల దండోరా మండల అధ్యక్షులు ఎర్రవెల్లి నాగేశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల విషయంలో గ్రామాలలో, మున్సిపల్ పరిధిలో కొంతమంది వ్యక్తులు (దళారులు ) తమకు డబ్బులు ఇస్తే ఇండ్లు ఇప్పిస్తామని చెబుతున్నట్లు తెలిసిందన్నారు. ఈ ఇందిరమ్మ ఇండ్ల విషయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పారదర్శకంగా వ్యవహరించి నిరుపేదలకి కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

# జెఆర్ఎఫ్ అర్హతా? జెఆర్ఎఫ్ స్కోరా?

- ఓయూ పిహెచ్‌డి కేటగిరి-1 ప్రవేశాల్లో కొత్త వివాదం!
- "మెరిట్‌లో మళ్లీ మెరిట్ ఎందుకు?" అని ప్రశ్నిస్తున్న పరిశోధక లోకం!

**హైదరాబాద్/వార్త వేధిక సూర్య :-** ఉస్మానియా విశ్వవిద్యాలయం పిహెచ్‌డి కేటగిరి--1 ప్రవేశాల సీట్ల కేటాయింపులో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒక కొత్త సంప్రదాయాన్ని ముందుకు తెచ్చేందుకు పాలకులు చేస్తున్న ప్రతిపాదనలు ఇప్పుడు తీవ్ర వివాదానికి దారితీస్తున్నాయి. జెఆర్ఎఫ్ సాధించిన అభ్యర్థుల 'స్కోర్' వెయిటేజీ ప్రకారం పిహెచ్‌డి సీటు ఇవ్వాలనే ప్రతిపాదన ప్రస్తుతం పరిశోధక ఆశావహ విద్యార్థుల్లో, విద్యార్థి సంఘాల్లో తీవ్ర చర్చకు, ఆందోళనకు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో "జెఆర్ఎఫ్ సాధించడమే ఒక అత్యున్నత మెరిట్ అయితే.. మళ్లీ మెరిట్‌లో మెరిట్ ఏంటి?" అనే ప్రాథమిక ప్రశ్న ఇటు వర్సిటీ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.

### గణాంకాలు చెప్పున్న సత్యం..

### 'వండిన అన్నాన్ని మళ్లీ వండడమే

యూజీసీ ఎన్టీఏ నెట్ రాసే లక్షలాది మందిలో కేవలం ఒక శాతం కంటే తక్కువ మంది మాత్రమే జెఆర్ఎఫ్ సాధిస్తారు. ఉదాహరణకు, డిసెంబర్ 2025 నెట్ ఫలితాల ప్రకారం తెలుగు సబ్జెక్టులో మొత్తం 5,721 మంది దరఖాస్తు చేసుకోగా, పరీక్ష రాసిన 4,307 మందిలో నెట్ సాధించిన వారు 307 (7.12%) మంది కాగా, జెఆర్ఎఫ్ సాధించిన వారు కేవలం 33 (0.76%) మంది మాత్రమే. అంటే జెఆర్ఎఫ్ సాధించడం అంటేనే



అత్యున్నత స్థాయి జాతీయ వడపోతను దాటి విజయం సాధించడం. అలాంటి వారిలో మళ్లీ స్కోర్ ఆధారంగా అంతర్గత మెరిట్ నిర్ణయించడం అంటే "వండిన అన్నాన్ని మళ్లీ వండడమే" అవుతుందని అభ్యర్థులు విమర్శిస్తున్నారు.

### సంవత్సరాల వారీగా స్కోర్లలో అస్థిరత -- సామాజిక న్యాయానికి గండి

ప్రతి సంవత్సరం యూజీసీ నెట్ ప్రశ్నాపత్రం ఒకే స్థాయిలో ఉండదు. ప్రశ్నాపత్రం సరళత, కాఠిన్యత ఆధారంగా కటాఫ్ మార్కులు మారుతుంటాయి. "అయిదు వేళ్లు ఒకేలా ఉండవు" అన్నట్లు, వివిధ సంవత్సరాల పరీక్షల స్కోర్లను ఒకే త్రాసుపై తూచడం ఏమాత్రం న్యాయబద్ధం కాదు. 2025 నాటి స్కోరుకు, 2024 లేదా 2023 నాటి స్కోర్లకు అసలు పొంతనే ఉండదు. అంతేకాకుండా, రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయ సూత్రాల ప్రకారం రిజర్వేషన్ల ఆధారంగా జెఆర్ఎఫ్ కటాఫ్ మార్కులు మారుతుంటాయి. ఈ తరుణంలో కేవలం 'స్కోర్'ను మాత్రమే ప్రధాన ప్రమాణంగా తీసుకుంటే.. రిజర్వేషన్ కేటగిరీల ద్వారా లభించాల్సిన అవకాశాలు క్రమంగా తగ్గిపోయి, సామాజిక న్యాయానికి గండిపడే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### వ్యాలిడిటీ ముగిసిపోతే 'చేతికి వచ్చిన పండు నోటికి రానట్లే'

జెఆర్ఎఫ్ అర్హతకు కేవలం 3 సంవత్సరాల పరిమిత కాలవ్యవధి మాత్రమే ఉంటుంది. కేవలం అధిక స్కోర్ ఉన్నవారికే వరుస అవకాశాలు కల్పిస్తూ పోతే, రిజర్వేషన్ కేటగిరీలలో కష్టపడి జెఆర్ఎఫ్ సాధించిన అనేక మంది అభ్యర్థుల వ్యాలిడిటీ కాలం ముగిసిపోయే ప్రమాదం ఉంది. దీనివల్ల జాతీయ స్థాయిలో సాధించిన విజయానికి గుర్తింపు లేకుండా పోయి, "చేతికి వచ్చిన పండు నోటికి రానట్లు" అవుతుందని విద్యార్థి లోకం ఆవేదన చెందుతోంది.

### జెఆర్ఎఫ్ అర్హతనే ప్రామాణికంగా తీసుకోవాలి -- ఇండ్ల ఉపేందర్ డిమాండ్



"విశ్వవిద్యాలయాల లక్ష్యం కేవలం మార్కులను కొలవడం కాదు.. సమాన అవకాశాలు కల్పించడం, సామాజిక న్యాయాన్ని పరిరక్షించడం" అని ఓయూ పరిశోధక విద్యార్థి ఇండ్ల ఉపేందర్ (9640832668) స్పష్టం చేశారు. జెఆర్ఎఫ్ అర్హత పొందిన వారందరినీ ఒకే సమానత్వ దృక్పథంతో చూడాలని, 'స్కోర్' వివాదాన్ని పక్కనబెట్టి జెఆర్ఎఫ్ అర్హతనే సీట్ల కేటాయింపునకు ఏకైక ప్రామాణికంగా పరిగణించాలని మేధావులు, బుద్ధిజీవులు వర్సిటీ పాలకులను డిమాండ్ చేస్తున్నారు. "న్యాయం చేయడమే కాదు, న్యాయం జరిగినట్లు కూడా కనిపించాలి" అనే సూత్రం ప్రకారం ఓయూ అధికారులు విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సోమవారం జూన్ 22, 2026
సంపుటి : 2, సంచిక : 33
Follow:




# యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తులు

- స్వామివారి నిత్య రాబడి

**రూ.56.59 లక్షలు**

**యాదగిరిగుట్ట జూన్ 21 (వార్త వేదిక సూర్య) :** ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం కొండపైన భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల రద్దీ కారణంగా కొండ కింద లక్ష్మీ పుష్కరిణి, అన్నదాన సత్రం, కళ్యాణ కట్ట, సత్యనారాయణ వ్రత మండపం, పార్కింగ్ ఏరియా, కొండపైన బస్ స్టేషన్, ప్రసాద క్యూలైన్లు, భక్తులతో నిండిపోయాయి. భక్తుల రద్దీ కారణంగా స్వామివారి ధర్మదర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట టైం పడుతుంది అని ఆలయ అధికారులు తెలిపారు . ఆలయంలో జరిగే సుదర్శన నారసింహ





హోమం, సువర్ణ పుష్పార్చన, నిత్య కళ్యాణం, వేద ఆశీర్వచనం, సాయంత్రం స్వామివారి వెండి జోడు మొక్కు సేవలో పాల్గొని, స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కొండపైన అనుబంధ ఆలయమైన శివాలయంలో శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. అనుబంధాలయమైన పాత గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని సందర్శించారు. స్వామివారి ఆలయ నిత్య రాబడిలో భాగంగా శనివారం రోజున రూ. 56,59,882, ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రవ ంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు లక్ష్మణాచార్యులు, రాకేష్ కుమార్ చార్యులు, మురళీ కుమార్ చార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ వేముల వీరేశంని కలిసి కృతజ్ఞతలు తెలియజేసిన సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి



**రామన్నపేట,జూన్ 21 (వార్తా వేదిక సూర్య) :** రామన్నపేట, మండలం కొమ్మాయిగూడెం ప్రజల కృషి, ప్రభుత్వ విప్ నకిరేకల్ మీూా వేముల వీరేశం చూపిన చొరవతో, ఆధాని కంపెనీ వారు తాము ప్రవేశ పెడదాము అనుకున్న అంభుజా సిమెంట్ ప్యాక్టరీ కాకుండా, లాజిస్టిక్ పార్కు మరియు డ్రై పోర్టు పెడుతున్నట్టు నిన్న యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ లో జరిగిన సమావేశంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం సమక్షంలో రామన్నపేట ప్రజాప్రతినిధులు, పెద్దల సమక్షంలో లిఖిత పూర్వకంగా లేఖ విడుదల చేయడం జరిగింది..ఇది రామన్నపేట ప్రాంత ప్రజలఅందరి విజయంఈ సిమెంట్ ప్యాక్టరీ ని ఇక్కడ నెలకొలపకుండా స్థానిక మీూా వేముల వీరేశం చూపిన చొరవ, ఆయనకి రామన్నపేట ప్రాంత ప్రజల మీద ప్రేమ మరువలేనిది అని ఈ సందర్బంగా కలిసి కృతజ్ఞతలు తెలియచేయడం జరిగింది..ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు మోటే మారయ్య, ఉపసర్పంచ్ తీర్పాల ఐలయ్య, ఎర్ర శేఖర్, బాలగోని గణేష్, వార్డు సభ్యులు అంబాల అశోక్, వీరమళ్ళ లింగస్వామి, బోయపల్లి శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు గురిజాల మహేష్ రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు కల్లూరి శివకుమార్, కొమ్మాయిగూడెం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వీరమళ్ళ పరశురామ్, ఆకిటి శివ తదితరులు పాల్గొన్నారు...

# ఇందిరమ్మ గృహప్రవేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**యాదగిరిగుట్ట జూన్ 21 (వార్త వేదిక సూర్య) :** యాదగిరిగుట్ట మండలం మల్లాపూర్ గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. గ్రామానికి చెందిన నక్క మధుశ్రీ, మహేష్ దంపతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు పట్టుబట్టలు, యాట పొట్టేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కొత్త ఇంటిలో అడుగుపెడుతున్న కుటుంబ సభ్యులకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ ఆయన ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. పేద కుటుంబాలు, అద్దె ఇళ్లలో, తాత్కాలిక గృహాల్లో ఇబ్బందులు పడకుండా శాశ్వత గృహాలను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ఆలేరు నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల అమలులో విశేష పురోగతి సాధించామని, రాష్ట్రవ్యాప్తంగా ఆలేరు నియోజకవర్గం మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు.

ఇందుకు ప్రజల సహకారం, అధికారుల సమన్వయం, ప్రభుత్వ సంకల్పమే కారణమన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.



గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు గృహ నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి కుటుంబం సొంత ఇంటిలో ఆనందంగా జీవించే రోజులు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, పేదల అభ్యున్నతి కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవం



**రామన్నపేట (వార్తావేదిక సూర్య )జూన్ 21** రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు యోగపట్ల అవగాహన కలిగించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండడానికి యోగా ఎంతో ఉపకరిస్తుందని, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలంటే ప్రతి ఒక్కరు యోగ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను వినియోగించడం వల్ల కలిగే అనర్థాల గురించి తెలియజేయడమే కాకుండా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించడం జరిగింది..ఎన్సిసి, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్సిసి అధికారి డాక్టర్ పి. వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ అధికారి ఎం. అనిత, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జె. చిన్నబాబు, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ నీలిమతో పాటు అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన శాసన సభ్యులు అనిల్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్ , జూన్ 21 (వార్త వేధిక సూర్య):-** జాగృతి విద్యా సంస్థల చైర్మన్ , జీనియస్ హై స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ బొజ్జ సూర్య నారాయణ రెడ్డి అన్న కుమారుని వివాహానికి భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు . ఈ వివాహ మహోత్సవం కుటుంబ సభ్యులు , బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు .

## మున్సిపల్ వైస్‌చైర్మెన్‌కు ఆత్మీయ సన్మానం



**మోత్కూరు: జూన్ 21 ( వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని బిక్కేరు వాగు వెంట ఉన్న శ్రీ కంఠమహేశ్వర స్వామి కళ్యాణోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పదహారు పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మెన్ పల్లెర్ల వెంకన్న గుప్తా ను దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో శాలువా,పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గనగాని చంద్రయ్య, అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు బుర్ర కృష్ణ, లోడే యాదగిరి, బుర్ర రమేష్, బుర్ర రాములు ఎడ్ల పక్కిరు, బుర్ర నర్సయ్య, బుర్ర యాదయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. .

## భాస్కర్‌కు ఆత్మీయ సన్మానం



**మోత్కూరు, జూన్ 21 ( వార్తా వేదిక సూర్య ):** మోత్కూరు తాలూకా పరిధిలో మోత్కూరు, ఆత్మకూరు ( ఎం), అడ్డగూడూరు, గుండాల మండలాల ప్రజలకు 108 అంబులెన్స్ లో ఈఎంటిగా గత పదేళ్ల పైగా ప్రతినిత్యం రోడ్డు ప్రమాద బారిన రోగులకు వైద్య సేవలు అందిస్తూ ప్రజా సేవలు చేస్తున్న మోత్కూరు అంబులెన్స్ ఈఎంటి తొంట భాస్కర్ కు మాతృదేవోభవ పితృదేవోభవ ఆధ్వర్యంలో బెస్ట్ సేవా పురస్కారాలను అవార్డులను ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శాలువాతో సన్మానించి సర్టిఫికెట్ మెమొంటో జ్ఞాపికను అందజేశారు.ఆదివారం వలిగొండ మండలం ఎం. తుర్కపల్లి గ్రామంలో జిల్లాలో ఉత్తమ సేవలందిస్తున్న ప్రజా, సామాజిక సేవకులను బెస్ట్ సేవా పురస్కారాలను మాతృదేవోభవ పితృదేవోభవ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు .ఈ సందర్భంగా అవార్డు అందుకున్న భాస్కర్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి మాతృదేవోభవ పితృదేవోభవ అవార్డు అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## గొర్రెల కొట్టాల తొలగింపుకు గ్రామస్తుల డిమాండ్



**మహేశ్వరం, జూన్ 21: వార్త వేదిక సూర్య** గ్రామం మధ్యలో ఇళ్లకు సమీపంగా ఏర్పాటు చేసిన మేకలు, గొర్రెల కొట్టాల కారణంగా ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని దిలావర్‌గూడ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం దిలావర్‌గూడ గ్రామానికి చెందిన పలువురు మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.గ్రామంలో మేకలు, గొర్రెల పెంపకం అధికంగా ఉండటంతో వాటి కొట్టాలను నివాసాల మధ్య ఏర్పాటు చేశారని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో కొట్టాల పరిసరాల్లో అపరిశుభ్ర పరిస్థితులు నెలకొని దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. దీంతో డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.సాయంత్రం వేళల్లో దోమల బెడద అధికంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామపంచాయతీ అధికారులు వెంటనే స్పందించి ఇళ్ల మధ్య ఉన్న మేకలు, గొర్రెల కొట్టాలను గ్రామానికి దూరంగా తరలించే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.







Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**